ఉరుసు మహోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

విశాలాంధ్ర-పెదకాకాని : మండల కేంద్రమైన పెద కాకానిలోని హజరత్ సయ్యద్ బాజీ షహీద్ ఔలి యా బాబా గారి 535వ ఉరుసు మహోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ముఖ్య కార్య నిర్వహణ అధికారి అబ్దుల్ ఖాదిర్ తెలిపారు. మంగళవారం దర్గా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీ రాత్రి 10 గంటలకు ముస్లిం పాలెం జండా చెట్టు నుంచి అత్యంత వైభవంగా బయలుదేరునని, 21వ తేదీన దీపారాధన ఖురాన్ పఠనం జరుగునని తెలిపారు. ఈ ఉరుసు మహోత్సవానికి వచ్చే భక్తులందరికీ ప్రత్యేక సౌకర్యాలు ఏర్పాటు చేశారని మెయిన్ సెంటర్ నుంచి దర్గా వరకు ప్రత్యేకంగా విద్యుత్ దీపాలతో అలంకరిస్తారని తెలిపారు. వచ్చిన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్థానిక పోలీసు వారి సహకారంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేకమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. దర్గా ఈవో ముక్తార్ భాష తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ కేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర-గుంటూరు : వేసవి తీవ్రత నేపథ్యంలో గుంటూరు పట్టణ ఫ్యాన్సీ స్టేషనరి జనరల్ మర్చంట్ అసోసియేషన్, వాసవి గుంటూరు కింగ్స్, గుంటూరు క్వీన్స్ ఆధ్వర్యంలో స్థానిక ఫ్యాన్సీ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని తెలుగుదేశం పార్టీ నగర అధ్యక్షులు డేగల ప్రభాకర్ మంగళ వారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మజ్జిగతోనే వేసవి తాపం తీరుతుందని, ఈ వేసవిలో బాటసారులకు ఉచితంగా మజ్జిగ అందించడం అభినందని యమని అన్నారు. కొన్ని రోజులుగా ఎండ తీవ్రత ఎక్కువగా ఉందని, ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అత్యవసరమైతేనే మధ్యాహ్నం పూట బయటకు రావాలన్నారు. అసోసియేషన్ నాయకులు రంగా వెంకట రామకృష్ణ, అచ్యుత నిరంజన్, మారుతి శ్రీకాంత్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అగ్నిమాపక వారోత్సవాలు

విశాలాంధ్ర-మేడికొండూరు : పేరేచర్లలో జోసిల్ కంపెనీలో మంగళవారం అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా కార్మికులకు అగ్ని ప్రమాద నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా రీజనల్ ఫైర్ ఆఫీసర్ మాక్యూ జిలాని, గౌరవ అతిథిగా అసిస్టెంట్ డివిజనల్ ఫైర్ ఆఫీసర్ ఎన్.పార్థసారథి కంపెనీకి విచ్చేసి అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఆస్తి ప్రాణనష్టాలు జరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై అమూల్యమైన విలువైన సలహాలు సూచనలు కార్మికులకు తెలియజేశారు. దీనిలో భాగంగా ఫైర్ సిబ్బంది జోసిల్ ఉద్యోగులకు అగ్ని ప్రమాద నివారణ చర్యల్లో భాగంగా శిక్షణ తరగతులు నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు అరికట్టే విధానాలతో పాటు మంటలను అదుపు చేయుట, గాయపడిన వారిని రక్షించాల్సిన విధివిధానాలతో కూడిన మార్క్ డ్రిల్ నిర్వహించారు.

చలివేంద్రం ఏర్పాటు

విశాలాంధ్ర-తెనాలి : పట్టణ ఆర్యవైశ్య సంఘం, అనుబంధ సంఘాలు సంయుక్తంగా వేసవి కాలాన్ని పురస్కరించుకొని ఎండ తీవ్రతతో దాహంతో ఇబ్బంది పడుతున్న బాటసారులకు, పురజనులకు ఉపయోగపడే విధంగా గత ఏడాదిలాగే ఈ సంవత్సరం కూడా చలివేంద్రాన్ని గంగానమ్మపేటలోని తిరుపతమ్మ గుడి వద్ద ఏర్పాటు చేశారు. ఆర్యవైశ్య లీగల్ సెల్ ఛైర్మన్ దరిశి కోటేశ్వరరావు చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మద్దాలి శేషాచలం, వంకదాసు శివ సుధాకర్, మాలేపాటి తిరుమలేశ్వరరావు, సివి రమణ, లక్ష్మీపద్మావతి, నాగసుధా, ఆర్యవైశ్య ప్రముఖులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నాగుర్ షరీఫ్‌కు సత్కారం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి (జీజీహెచ్)లోని సుశృత హాలులో మినిస్టీరియల్ స్టాఫ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎన్‌జీఓ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులైన షేక్ నాగుర్ షరీఫ్‌ను మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ సత్కార సభకు మద్దు ప్రేమజ్యోతి బాబు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి మాట్లాడుతూ ఒకరినొకరు సహాయం చేసుకుంటూ సమస్యలను పరిష్కరించే విధంగా పని చేయాలన్నారు. ఎన్‌జీఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఘంటసాల శ్రీనివాసరావు, ఎస్.సతీష్ కుమార్, కోశాధికారి శ్రీధర్ రెడ్డి, నగర అధ్యక్షులు సూరి, జీజీహెచ్ ఏడి నాగేశ్వరరావు, ఏ ఓ పూసల శ్రీనివాసరావు, ఆర్ఓ ఆఫీస్ సూపరింటెండెంట్ డాక్టర్ రాజకుమార్, అసోసియేషన్ నాయకులు డి.సాంబశివరావు, బొట్టు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణే బీజేపీ లక్ష్యం

విశాలాంధ్ర-గుంటూరు : ప్రభుత్వ రంగ సంస్థ లను పరిరక్షించవలసిన బాధ్యతను విస్మరించి... ప్రైవేట్, కార్పొరేట్ వ్యక్తులకు యావత్ భారతదేశాన్ని దోచిపెడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయడమే లక్ష్యంగా కేంద్రంలో ఉన్న నరేంద్ర మోదీ ప్రభుత్వం పనిచేస్తుందని ఏఐటీయూసీ గుంటూరు జిల్లా కార్యదర్శి మేడా హనుమంతరావు అన్నారు. సీపీఐ, సీపీఎం ఆధ్వ ర్యంలో రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ప్రచార భేరి కార్యక్రమం 5వ రోజు సీపీఐ నగర కమిటీ సభ్యులు యశ్వంత్ అధ్యక్షతన స్థానిక శారదాకాలనీలోని ఆర్చి సెంటర్‌లో మంగళవారం సాయంత్రం జరిగింది. ఈ సందర్భంగా మేడా హనుమంతరావు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్నికల సమయంలో దేశ ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదని విమర్శించారు. పైగా పెద్దలకు రాయితీలు పేదలకు ధరల భారాలు మోపిందని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో దేశాన్ని రక్షించుకోవడం కోసం సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో ప్రచార భేరి కార్యక్రమం ద్వారా ప్రజలను చైతన్యవంతులను చేసే బాధ్యతను చేపట్టడం జరిగిందని అన్నారు. ఉదయం శారదాకాలనీ ప్రాంతంలో ప్రచార యాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, సీపీఎం నగర కార్యదర్శులు కోట మాల్యాద్రి, కె.నళినీకాంత్, సీఐటీయూ నగర కార్యదర్శి శ్రీనివాసరావు, స్థానిక కార్యదర్శి దండు రవి, సీపీఎం నాయకులు శంకర్ పాల్గొన్నారు.

పీజీ మెడికల్ ఆశావహుల కోసం సూపర్ యాప్ విడుదల చేసిన అల్లెన్

గుంటూరు: మెడికల్ కోచింగ్‌లో అగ్రగామి సంస్థలలో ఒకటైన అల్లెన్, తమ అల్లెన్ నెక్స్ట్ యాప్ ను విడుదల చేస్తున్నట్లు వెల్లడించింది. నీట్-పీజీ, ఐఎన్ఐ-సీఈటీ, ఎఫ్ఎంజీఈ పరీక్షల ప్రిపరేషన్ కోసం సమగ్రమైన పరిష్కారంగా పీజీ మెడికల్ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా దీనిని తీర్చిదిద్దారు. ఈ యాప్ విస్తృత శ్రేణిలో వినూత్న ఫీచర్లను, వనరులను అందిస్తుంది. ఇది మార్కెట్లో అందుబాటులో ఉన్న ఇతర పరీక్షా ప్రిపరేషన్ ప్లాట్ఫామ్స్ కు భిన్నంగా ఉంటుందని అల్లెన్ నెక్స్ట్ వెర్టికల్ హోల్ టైమ్ ఎగ్జిక్యూటివ్ అమన్ మహేశ్వరి తెలిపారు.

మోదీని గద్దె దింపి దేశాన్ని కాపాడండి: జంగాల

విశాలాంధ్ర-పొన్నూరు : పేదల పొట్ట కొట్టి కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్న బీజేపీ ప్రభుత్వాన్ని సాగనంపేందుకు అందరూ ఐక్యం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. మోదీని గద్దె దింపి దేశాన్ని కాపాడుకునేందుకు సీపీఐ, సీపీఎం పార్టీలు చేపట్టిన ప్రచార బేరి యాత్ర పొన్నూరు పట్టణంలో మంగళవారం స్థానిక హైలాండ్ సెంటర్‌లో జరిగింది. దానికి ఐలాండ్ సెంటర్ నుంచి ప్రారంభమైన ప్రచార బేరి యాత్ర పట్టణంలో పర్యటించారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న దుర్మార్గపు వ్యతిరేక పాలనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అజయ్ కుమార్ మాట్లాడుతూ నిత్యవసర వస్తువులు బియ్యం, పెట్రోలు, విద్యుత్తు, వంట గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో ప్రజలకు జీవనం గుదిబండలా మారిందని నిరుపేద బ్రతుకులు మరింత అగాధంలోకి జారిపోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మోదీ పాలనలో మహిళలకు రక్షణ లేకపోవడంతో పాటు హత్యలు అత్యాచారాలు దిగిపోవడంతో పాటు దళిత గిరిజన ప్రజలు సంక్షేమానికి సామాజిక న్యాయానికి దూరమయ్యారని ఆయన పేర్కొన్నారు. నిత్యవసర ధరలు పెరగడం వల్ల పేద, బడుగు బలహీన వర్గాల ప్రజలు జీవనం అధ్వానంగా మారిందని గతంలో జేబులో డబ్బుతో సంచుల్లో సరుకులు తెచ్చేవారుమని ఇప్పుడు సంచుల్లో డబ్బులు తీసుకెళ్లి జేబుల్లో సరుకులు తీసుకునే పరిస్థితి ఏర్పడిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని వర్గాల ప్రజలు ఐక్యమై ప్రజలకు దుర్మార్గ పాలను అందిస్తున్న మోదీని దించాలని కోరారు. ప్రభుత్వ రంగ సంస్థలైన ఎల్ఐసీ, పోస్టల్ ఓడరేవులు, విమానయాన శాఖలు, బ్యాంకులను, గనులను మోదీ ప్రైవేటుపరం చేయటం ద్వారా అదానీ, అంబానీలకు దోచిపెడుతున్నారని పేదల సంక్షేమ వారికి పట్టలేదని ఆయన దుయ్యబట్టారు. మోదీని గద్దెదించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పొన్నూరు పట్టణ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఆరేటి రామారావు, గేయ రచయిత దేవరకొండ శ్రీనివాస్, ఆరేటి సురేష్, సుబ్బారావు, రెంటాల కుమారి, మహిళా సమైక్య సుగుణ, సీపీఎం నాయకులు దండా లక్ష్మీనారాయణ, నిమ్మకూరు రమేష్, రామ్ బ్రహ్మచారి తదితర నాయకులు పాల్గొన్నారు.

కార్మికుల జోలికొస్తే సహించం..

- ఎవరి పని వారు చేయండి
- విమలను పరామర్శించిన మున్సిపల్ యూనియన్ నేతలు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందలేదని చెప్పినందుకు మున్సిపల్ బదిలీ కార్మికురాలు కనపర్తి విమలను విధుల్లో నుంచి తొలగించడాన్ని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఖండిస్తోందని ఆ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోట మాల్యాద్రి, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి బందెల రవికుమార్ పేర్కొన్నారు. ఎవరి పని వారు చేయండి.. ప్రజా ప్రతనిధులు పాలన చేయండి.. అధికారులు పని చేయించుకోండి.. అంతేకానీ కార్మికుల జోలికొస్తే సహించేది లేదని హెచ్చరించారు. విధుల నుంచి సస్పెండై మనస్థాపానికి గురై నిద్ర మాత్రలు మింగి గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి (జీజీహెచ్)లో చికిత్స పొందుతున్న విమలను వారు మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా విమల ఆరోగ్య పరిస్థితిని డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. విమలకు మెరుగైన వైద్యం అందించాలని హాస్పిటల్ సిబ్బందిని కోరారు. అనంతరం జీజీహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయం ముందర ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే తొలగించే అధికారం మున్సిపల్ అధికారులకు మాత్రమే ఉంటుందన్నారు. కానీ మున్సిపల్ కార్మికులను తొలగించే అధికారం ఎమ్మెల్యేలకు, కార్పొరేట్లకు లేదన్నారు. కుటుంబానికి విమల పెద్ద దిక్కె ఆ కుటుంబాన్ని పోషిస్తున్న విమల ఆధారం కోల్పోవడంతో ఒక్కసారిగా తన కుటుంబం అంతా అంధకారమైందని ఆమె ఎమ్మెల్యే ఎదుట ఆవేదన వ్యక్తంచేసిందని, అయితే విమల ఆవేదనను అర్థం చేసుకోలేని ప్రజాప్రతినిధులు విమల టీడీపీకి చెందిన వ్యక్తిగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందట్లేదని చెబుతుందని భావించిన ప్రజా ప్రతినిధులు ఆమెను పనుల నుంచి తొలగించారని అన్నారు. ఇది దుర్మార్గమైన చర్య అని వారు ఖండించారు. మున్సిపల్ కార్మికులపై వీరి పెత్తనం ఏంటని ప్రశ్నించారు. ఈ రాష్ట్రంలో వాక్ స్వాతంత్ర్యం ఉండకూడదని ఈ ప్రభుత్వం కార్మికులను పనుల్లోంచి తీసేసి భయభ్రాంతులకు గురి చేస్తోందని విమర్శించారు. అసలు మున్సిపల్ కార్మికులను తొలగించే హక్కు మీకెవరిచ్చారు అని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాజకీయ ఒత్తిళ్ళతో కార్మికురాలు విమలను ఎవరైతే విధుల్లో నుంచి తొలగించారో ఆ అధికారులే బాధ్యత తీసుకుని ఆమెను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ఎస్సీ కమిషన్ ద్వారా బాధ్యులుపై కేసు నమోదు చేసి బాధితురాలికి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. విమలకు న్యాయం జరగకపోతే భవిష్యత్ పోరాటాలకు ఈ ప్రభుత్వం సిద్ధంగా ఉండాల్సి వస్తోందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చల్లా మరియదాసు, దాసరి శివయ్య, జిర్రా యేసుదాసు, కోటి, వీరాంజనేయులు, నూనె దానియేలు, శివకుమార్ తదితరులు ఉన్నారు.

మతోన్మాద బీజేపీని సాగనంపాలి..

విశాలాంధ్ర-మంగళగిరి : మతాలు, కులాల పేరుతో ప్రజల మధ్య చిచ్చుపెడుతున్న బీజేపీ ప్రభుత్వాన్ని సాగనంపాల్సిన సమయం ఆసన్నమైందని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పిల్లలమర్రి నాగేశ్వరరావు, సీపీఎం సీనియర్ నాయకులు జేబీ రాఘవులు అన్నారు. సీపీఐ-సీపీఎం మంగళగిరి పట్టణ కమిటీల ఆధ్వర్యంలో మంగళవారం పాత మంగళగిరి సీపీఐ స్థూపం దగ్గర నుంచి ప్రచార బేరి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో అధికారంలో ఉన్న బీజేపీ సమస్యలను పరిష్కరిస్తామంటూ అధికారం లోకి వచ్చి వాటిని పరిష్కరించకపోగా కొత్త సమస్యలు సృష్టిస్తోందని అన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన వారిలో కమ్యూనిస్టులు, ముస్లింలు ఉన్నారని, బీజేపీ ఆర్ఎస్ఎస్ వారు లేరని స్పష్టం చేశారు. కనీసం ఒక్క చోట కూడా స్వాతంత్రం కోసం పోరాడిన చరిత్ర బీజేపీకి గాని, ఆర్ఎస్ఎస్‌కి గాని లేదని అన్నారు. వారు నేడు అధికారంలోకి వచ్చిన తరువాత మతాలు, కులాల మధ్య చిచ్చుపెట్టడానికి ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. దేశ సంపదను ప్రైవేట్ వ్యక్తులకు అమ్మటానికి ప్రయత్నం చేస్తుందని, ఎల్ఐసీ దగ్గర నుంచి రైల్వే విమానాశ్రయాలు ఉక్కు పరిశ్రమలు ప్రైవేటు వ్యక్తులకు అప్పజెప్పటానికి ప్రయత్నం చేస్తుందని అన్నారు. పేద, మధ్యతరగతి వర్గాలకి ఏమాత్రం ఉపయోగం లేనివిధంగా బీజేపీ వ్యవహరిస్తుందని అన్నారు. అందుకని దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల ముఖ్యమంత్రులు బీజేపీకి వ్యతిరేకంగా పోరాడటానికి సిద్ధంగా ఉన్నారన్నారు. రాష్ట్రంలో కూడా ప్రత్యేక హోదా 5 సంవత్సరాలు ఇస్తాను అంటే కాదు పది సంవత్సరాలు కావాలని బీజేపీ ఆనాడు పార్లమెంట్ సాక్షిగా వాగ్దానం చేసింది కానీ ఈనాటికీ ప్రత్యేక హోదా ఇవ్వడానికి వాళ్లు ముందుకు రావడం లేదన్నారు. రాష్ట్రంలో ఉన్న అధికార ప్రతిపక్షాల నాయకులు కానీ ఎవరు కూడా బీజేపీని గట్టిగా మాట్లాడలేని పరిస్థితి. ఇటువంటి బీజేపీ మళ్లీ అధికారంలోకి వచ్చి పరిపాలిస్తే ఈ దేశంలో ఉన్నటువంటి ఆర్థిక రంగం ప్రజానీకం యావత్తు కుప్పకూలిపోయే పరిస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా 23, 24, 25, 26, 17 వార్డులలో ఇంటింటికి తిరు గుతూ కరపత్రాలను ప్రజలకు అందజేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. ఈ ప్రచార కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, జాలాది జాన్ బాబు, చిన్ని సత్యనారాయణ, పంతగాని మరియదాసు, హరిప్రసాద్, గంజి పట్టాభి, సీపీఎం నాయకులు జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్ఎస్ చెంగయ్య, పిల్లలమర్రి బాలకృష్ణ, కమలాకర్, చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

దేశాన్ని తాకట్టుపెడుతున్న బీజేపీని తరిమికొడదాం

విశాలాంధ్ర-తాడేపల్లి : అదానీకి దేశాన్ని తాకట్టుపెడుతున్న బీజేపీని తరిమికొట్టా లని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు అన్నారు. సీపీఐ-సీపీఎం ప్రచార భేరి కార్యక్రమాన్ని తాడేపల్లి పట్టణం సుందరయ్య నగర్1వ రోడ్డులో ప్రారంభించారు. ఈ సందర్భంగా పాశం రామారావు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం పూర్తిగా కార్పొరేట్లకు దాసోహం అయిందని అన్నారు. దేశాన్ని అదాని లాంటి వారికి తాకట్టు పెడుతున్నారని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తున్నారన్నారు. సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి కంచర్ల కాశయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సామాన్య ప్రజలపై మోయలేని భారాలు వేస్తున్నారని అన్నారు. రాష్ట్రానికి రావలసిన నిధులు సాధించటంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ప్రచార భేరి ముగింపు సందర్భంగా ఏప్రిల్ 24న మంగళగిరిలో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ తాడేపల్లి ప్రాంత సహాయ కార్యదర్శి తుడిమెల్ల వెంకటయ్య, మానికొండ డాంగే, మునగాల రామారావు, జి.శివ, దొంత కోటేశ్వరరావు, బాషా, అనిల్, సీపీఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు, రూరల్ మండలం కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి, నాయకులు కొట్టె కరుణాకరరావు, వేముల దుర్గారావు, సోలా ముత్యాలరావు, దొంతిరెడ్డి విజయ భాస్కర్ రెడ్డి, యనమాల బర్న బాస్, కె.ఉషారాణి, బొబ్బిలి రామారావు, కొట్టె ప్రభాకరరావు, షేక్ బాష, కట్టా మేరీ, ఏసిపోగు శాస్త్రి, ఏషియా తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల వేగవంతానికి చర్యలు : కలెక్టర్

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరే షన్: రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమమైన పేదలందరికీ ఇళ్ళ పథకం లే అవుట్ లలో ఇళ్ల నిర్మా ణాలు వేగవంతంగా జరిగేలా మున్సిపల్ కమిషనర్లు, హౌసింగ్ అధికారులు సమన్వయంతో లబ్దిదారులకు అవగాహన కల్పిస్తూ, అప్షన్ 3 ఇళ్ల నిర్మాణ ఏజెన్సీలను నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని డీఆర్సీ హాలులో ఇళ్ళ నిర్మాణాల పురోగతిపై ఉదయం తెనాలి, పొన్నూరు మున్సిపాల్టీలకు సంబంధించి తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మతో, మధ్యహ్నం గుంటూరు నగరపాలక సంస్థకు సంబంధించి కమిషనర్ కీర్తీ చేకూరి, అసిస్టెంట్ కలెక్టర్ శివనారాయణ శర్మతో కలసి హౌసింగ్, మున్సిపల్, విద్యుత్‌బీ పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఆప్షన్ 3 ఇళ్ళ నిర్మాణ ఏజెన్సీల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. తెనాలి, పొన్నూరు, గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని లే అవుట్ ల వారీగా ఇళ్ళ నిర్మాణాల వివరాలను, నిర్మాణ పనులు వేగవంతం చేయటానికి తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై కలెక్టర్ నిర్మాణ ఏజెన్సీలు, హౌసింగ్‌బీ మున్సిపల్ అధికారులతో పూర్తి స్థాయిలో సమీక్షించి సూచనలు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గుంటూరు నగరపాలక సంస్థ లే అవుట్ లలోను నీటి సమస్యలు లేకుండా పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని, ప్రత్యమ్నాయ ఏర్పాట్లుకు ప్రతిపాదనలు ఇవ్వాలన్నారు. పనులు వేగవంతంగా జరిగేలా ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో పాటు, హౌసింగ్ ఇంజనీర్లు, నోడల్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో హౌసింగ్ పీడీ సాయినాథ కుమార్, ఆర్డీవో ప్రభాకర రెడ్డి, సంబంధిత అధికారులు, ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు.

వైసీపీ అసమర్థతను ప్రశ్నిస్తే హింసిస్తారా?

విశాలాంధ్ర-గుంటూరు : రాష్ట్రంలో అనధికార ఎమర్జెన్సీ పాలన కొనసాగుతుందని, బ్రతికుండగానే ప్రజలకు నరకయాతన చూపిస్తున్న వైసీపీ నేతల కన్నా శవాలని పీక్కుతినే రాబందులు మేలని జనసేన పార్టీ రాష్ట్ర కార్య దర్శి వడ్రాణం మార్కండేయ బాబు, గుంటూరు అర్బన్ జిల్లా అధ్యక్షుడు నేరేళ్ళ సురేష్ విమర్శించారు. కార్పొరేటర్ వేధింపుల నేపథ్యంలో ఆత్మహత్యాయత్నంకు పాల్పడి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న పారిశుద్ధ్య కార్మికురాలు కనపర్తి విమలను జనసేన పార్టీ నేతలు మంగళ వారం పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని అక్కడి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మార్కండేయ బాబు మాట్లాడుతూ ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను తట్టుకోలేని వైసీపీ నేతలు ప్రజలపై ప్రధానంగా దళితులపై బెదిరింపులకు దిగటం దుర్మార్గమన్నారు. నేరేళ్ళ సురేష్ మాట్లాడుతూ ప్రభుత్వ అసమర్థతను ప్రశ్నిస్తే హింసిస్తారా అంటూ వైసీపీ నేతల్ని నిలదీశారు. రాష్ట్ర కార్మిక సంఘ నేత సోమి శంకరరావు మాట్లాడుతూ విమల ఆత్మహత్యా యత్నంకు కారణమైన వారిపై జాతీయ ఎస్సీ, ఎస్టీ కమీషన్‌కు ఫిర్యాదు చేస్తామని అన్నారు. జన సేన పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఆళ్ళ హరి మాట్లాడుతూ కనపర్తి విమలను మరలా విధుల్లోకి తీసుకోవా లని, ఆర్థికంగా ఆదుకోవాలని వైసీపీ నేతల్ని కోరారు. లేనిపక్షంలో జనసేన పార్టీ తరుపున పోరాటం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. పరామర్శిం చిన వారిలో ఉప్పు వెంకట రత్తయ్య, చింతా రేణుకా రాజు, సోమి ఉదయ్, పుల్లంసెట్టి ఉదయ్ కుమార్, దుర్గ ప్రసాద్, ఏడుకొండలు, పులిగడ్డ నాగేశ్వరరావు, శాంతి కుమార్, జడ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఎం స్పోర్ట్స్ ఫెస్ట్ క్రికెట్ విజేత ఆర్‌వీఆర్

విశాలాంధ్ర-మంగళగిరి : ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ఈ నెల 15న ప్రారంభమైన జాతీయస్థాయి ఉద్గమ్ స్పోర్ట్స్ ఫెస్ట్ (క్రీడా సంబరాలు) సోమవారం సాయంత్రం ఘనంగా ముగిశాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలకు చెందిన 14 యూనివర్సిటీలు, ఇంజినీరింగ్ కాలేజీల నుంచి సుమారు 700 మంది క్రీడాకారులు పోటీలకు హాజరయ్యారు. విజేతలకు సోమవారం సాయంత్రం ప్రశంసాపత్రాలతో పాటు షీల్డులను ప్రదానం చేశారు. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య మనోజ్ కే అరోరా, ప్రో వైస్ ఛాన్సలర్ ఆచార్య డి.నారాయణరావు, రిజిస్ట్రార్ డాక్టర్ ప్రేమ్ కుమార్, స్పోర్ట్స్ డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌లు విజేతలకు షీల్డులను ప్రదానం చేశారు.

విజేతల వివరాలు: ఏపీ ఎస్ఆర్ఎం నిర్వహించిన ఉద్గమ్ క్రీడా సంబరాల్లో ఎస్ఆర్ఎంతో పాటు కేఎల్‌యూ, విజ్ఞాన్, పీబీ సిద్ధార్థ, వీవీఐటీ, విట్ ఏపీ, ఆర్‌వీఆర్‌జేసీ, గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజీలతో పాటు తెలంగాణకు చెందిన పలు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. పురుషుల క్రికెట్ పోటీల్లో ఆర్‌వీఆర్‌జేసీ, ఏపీ ఎస్ఆర్ఎంలు ప్రథమ, ద్వితీయ స్థానాలను కైవసం చేసుకున్నాయి. పురుషుల ఫుట్‌బాల్ పోటీల్లో కేఎల్‌యూ, ఎస్ఆర్ఎం యూనివర్సిటీల జట్లు విజేతలు కాగా, వాలీబాల్ పోటీల్లో ఎంఐసీ ఇంజినీరింగ్ కాలేజీ, ఎస్ఆర్ఎంలు మొదటి రెండు స్థానాలను కైవసం చేసుకున్నాయి. అదేవిధంగా మహిళల వాలీబాల్ పోటీల్లో ఎస్ఆర్ఆఈసీ విన్నర్స్ కాగా, ఎస్ఆర్ఎం జట్టు రన్నర్స్‌గా నిలిచింది. అథ్లెటిక్స్ పోటీల్లో ఏపీ ఎస్ఆర్ఎం, కేఎల్‌యూలు అన్నింటా పోటీపడ్డాయి. పురుషుల ఫుట్‌బాల్ పోటీల్లో కేఎల్‌యూ విద్యార్థులు అద్భుతమైన క్రీడా ప్రతిభను చూపారు. విజేతలకు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య మనోజ్ కుమార్ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీన్ డాక్టర్ విష్ణుపథ్, కమ్యూనికేషన్స్ డైరెక్టర్ పంకజ్ బెలెవెరియ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర గుంటూరు జిల్లా

కేఎల్‌యూ కౌన్సిలింగ్ షెడ్యూల్ విడుదల

విశాలాంధ్ర-తాడేపల్లి : కేఎల్ యూనివర్సిటీ విజయవాడ, హైదరాబాద్ క్యాంపస్‌లలో ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశానికై ఈ నెల 27 నుంచి మే 5వ తేదీ వరకు నిర్వహించనున్న ఇంజనీరింగ్ కౌన్సిలింగ్ షెడ్యూల్‌ను రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి మంగళవారం తన కార్యాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్ కళాశాలగా ప్రారంభమై ఈ రోజు డీమెడీ యూనివర్సిటీ స్థాయికి చేరుకుని వేలాది విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్య, నైపుణ్యాలను అందించటం విశేషమని అన్నారు. ఉన్నత విద్య కోసం మన రాష్ట్ర విద్యార్థులు ఇతర రాష్ట్రాలకు వెళ్లాల్సిన అవసరం లేదని నాణ్యమైన విద్య ఇక్కడ అందుబాటులో ఉందని రామకృష్ణారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ఉప కులపతి డాక్టర్ సారధి వర్మ, అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ జె.శ్రీనివాసరావు, ఎంహెచ్ఎస్ విభాగం డీన్ డాక్టర్ కిషోర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ కళాశాలతో వీటీచ్ ఒప్పందం

విశాలాంధ్ర-గుంటూరు : అంతర్జాతీయ పరీక్షల శిక్షణ మరియు అబ్రాడ్ కౌన్సిలింగ్‌లో విశేష అనుభవం ఉన్న విటీచ్ సంస్థతో నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల గుంటూరు పాలనా కేంద్రంలో ఎంఓయూ కుదుర్చుకున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాస్ కుమార్, విటీచ్ సీఈఓ గోసాల అలెగ్జాండర్ ప్రకటించారు. ఈ సందర్భంగా విటీచ్ సీఈవో అలెగ్జాండర్ గోసాల మాట్లాడుతూ అంతర్జాతీయ పరీక్షల శిక్షణలో ప్రత్యేకత కలిగిన విటీచ్ సంస్థ ఐఈఎల్‌టీఎస్, టోఫెల్, గ్రే పరీక్షలకు సమగ్ర కోచింగ్‌ను అందించడంతోపాటు కౌన్సిలింగ్ ద్వారా విదేశాలలో ఉన్నత విద్యలు చదివేందుకు పూర్తి స్థాయిలో సహకరించేలా శిక్షణ అందిస్తామని తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు విదేశాలలో ఉన్నత విద్యలు చదివేందుకు, విద్యార్థుల వారి కలలు నిజం చేసుకునేందుకు ముందస్తుగా తీసుకొనే ఈ శిక్షణ ఉపయోగపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో చీఫ్ ఫైనాన్స్ ఆఫీసర్ డాక్టర్ సాయి లక్ష్మి, విటీచ్ మార్కెటింగ్ హెడ్ అభిషేక్, హెచ్‌ఓడీ పుష్పరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి : నాగరాజు

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: ఆంధ్రప్రదేశ్ లోని పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని మహారాష్ట్ర లోని పూనే జిల్లా బారమ తిలో జరిగిన ఆల్ ఇండి యా రాష్ట్ర పెన్షనర్ల సమాఖ్య జాయింట్ కౌన్సిల్ మీటింగ్‌లో మాట్లాడినట్లు ఆల్ ఇండియా రాష్ట్ర పెన్షనర్ల సంఘాల జాతీయ కార్యదర్శి పి.నాగరాజు మంగళవారం తెలిపారు. 2 విడతల డీఏ ఎరియర్స్ 2022 జనవరి, జులై, 2023 జనవరి నెలల 3 విడతలు బకాయిలు చెల్లించాలని, పీఆర్సీ, కోతకోసిన అదనపు క్వాంటం పెన్షన్ 3శాతం తగ్గించిన మొత్తాన్ని చెల్లించాలని, పెరుగు తున్న ధరలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల స్థాయిల్లో తగ్గించాలని, పెన్షనర్లను ఇన్‌కంటాక్స్ పూర్తిగా మినహాయించాలని, రైల్వేలో రాయితీలను పునరుద్దరిం చాలని తీర్మానాలను ఆమోదించి ప్రధాన మంత్రికి మెమోరాండం సమర్పించా లని సమావేశంలో నిర్ణయించినట్టు తెలిపారు. సమావేశంలో సమాఖ్య అధ్యక్షులు ఏ.కే.శర్మ, మాజీ అధ్యక్షులు యస్.యస్. దుబే, ప్రధాన కార్యదర్శి డి.సుధాకరరావు తదితరులు ప్రసంగించారు.

వాలంటీర్ వ్యవస్థను దుర్వినియోగం చేస్తున్నారు

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: వైసీపీ ప్రభుత్వం వాలంటీర్ వ్యవస్థను దుర్విని యోగం చేస్తోందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వడ్రాణం హరిబాబు విమర్శించారు. జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ ధనం జీతాలుగా ఇచ్చి పార్టీ సేవ చేయించుకోవటం ఎంత వరకు సమంజసమని అన్నారు. వాలంటీర్లకు ఏడాదికి రూ.2 వేలు కోట్ల ప్రజాధనం దోచి పెడుతున్నారని విమర్శించారు. వాలంటీర్ వ్యవస్థను దుర్వినియోగం చేయొద్దని గతంలో ఎన్నికల కమిషన్ ఆదేశించినా ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో వేలాది దొంగ ఓట్లను నమోదు చేయించేందుకే వాలంటీర్లను ఉపయోగించారు. ఇప్పుడు వైసీపీ స్టిక్కర్లు, కరపత్రాలు అంటించడానికి ఇంటింటికి పంచడానికి గృహసారధులతో కలిసి పని చేస్తున్నారు. ప్రజాస్వామ్య విరుద్ధంగా పాలన సాగిస్తూ వాలంటీర్ల ద్వారా పార్టీ కార్యక్రమాలు నిర్వహించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో బొబ్బిలి రామారావు, కె.యం.ఇ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి ప్రసాదాలు చెరువులు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ప్రకృతి ప్రసాదితమైన చెరువులను మరింత ప్రజోపయోగంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు ఎమ్మెల్సీ, పార్టీ కేంద్ర కార్యాలయ పర్యవేక్షకులు లేళ్ళ అప్పిరెడ్డి తెలిపారు. అందులో భాగంగా ప్రస్తుతం గుంటూరు పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని చుట్టుగుంట చెరువును శరవేగంగా అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. చుట్టుగుంట చెరువు చుట్టూ జరుగుతున్న అభివృద్ధి పనులను స్థానిక ఎమ్మెల్యే మద్దాళి గిరి, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, కార్పొరేటర్లు, కార్పొరేషన్ అధికారులు, స్థానిక పార్టీ నేతలతో కలిసి ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి మంగళవారం పరిశీలించారు. అనంతరం 25వ డివిజన్ పరిధిలోని జోసఫ్ నగర్ శివారు ప్రాంతంలో గల చెరువును సందర్శించారు. ముందుగా అక్కడి చెరువును శుభ్రపరిచి స్థానికుల ఆకాంక్షలకు అనుగుణంగా దాన్ని ఎలా తీర్చిదిద్దవచ్చో పరిశీలన చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ బత్తుల దేవానంద్, కార్పొరేటర్లు చంద్రగిరి కరుణకుమారి, అడకా పద్మావతి, అచ్చాల వెంకటరెడ్డి, షేక్ రోషన్, అందుగుల సంతోష్, బూసి రాజలత, దివ్యాంగుల కార్పొరేషన్ ఛైర్ పర్సన్ ముంతాజ్ పఠాన్, పార్టీ నేతలు పాల్గొన్నారు.

ఈసారి అధికారం టీడీపీదే

విశాలాంధ్ర-తాడికొండ : 2024లో అధికారం టీడీపీదేనని మాజీ మంత్రి నక్కా ఆనంద్ బాబు జోష్యం చెప్పారు. మాజీ శాసనసభ్యులు తెనాలి శ్రావణ్ కుమార్ చేపట్టిన సామాజిక చైతన్య పాదయాత్ర మూడవరోజు మంగళవారం పొన్నెకల్లు, రావెల, పాములపాడు, బేజాతపురం గ్రామంలో కొనసాగింది. రావెల గ్రామంలో నక్కా ఆనంద్ బాబు మాట్లాడారు. రాష్ట్ర ప్రజలు జగన్‌మోహన్ రెడ్డికి ఒక్క అవకాశం ఇస్తే రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారని ధ్వజమెత్తారు. ఎన్నికల హామీలను తుంగలో తొక్కారని ధ్వజమెత్తారు. అమరావతిని సర్వనాశనం చేసిన వ్యక్తి జగన్‌మోహన్ రెడ్డి అని అన్నారు. గడచిన నాలుగు సంవత్సరాలు కాలంలో రాష్ట్రంలో అనేక ఉద్యమాలు నడిచాయని అయినా ప్రభుత్వంలో చలనం లేదన్నారు. టీడీపీ నాయకులు మద్దిరాల మ్యాని, గుంటుపల్లి మధుసూదన్ రావు, నెల్లూరు కాంతారావు, బూసెట్టి వెంకటేశ్వరరావు, దగ్గు మళ్ళ శ్రీనివాసరావు, కోమటి శివయ్య, బండారు శివయ్య, వడ్లమూడి సుధీర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
పల్నాడు జిల్లా

విజేతలకు బహుమతులు ప్రదానం

విశాలాంధ్ర-వినుకొండ రూరల్ : పల్నాడు జిల్లా వినుకొండ నియోజకవర్గ శ్రీ మదమంచిపాటి వీరాంజనేయ స్వామి వారి తిరుణాల సందర్భంగా జరిగే జాతీయస్థాయి ఒంగోలు జాతి ఎద్ల బల ప్రదర్శనలు కార్యక్రమంలో పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జీవీ ఆంజనేయులు స్పాన్సర్ చేసిన ప్రైజ్ మనీని జూనియర్స్ సైజు ఎద్ల పందెంలో గెలిచిన జతలకు వారి చేతుల మీదగా మొదటి బహుమతి రూ.75 వేలు, రెండవ బహుమతి రూ.65 వేలు, మూడవ బహుమతి రూ.55 వేలు విజేతలకు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ 16 సంవత్సరాలు నుంచి రాష్ట్రస్థాయిలో ఎద్ల బల ప్రదర్శనశాల వినుకొండ నియోజకవర్గంలో చాలా విజయవంతంగా చేస్తున్న కమిటీకి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వినుకొండ మండలం, నూజెండ్ల మండలం తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.త

21 నుంచి కొండవీటి నాటికల పోటీలు

విశాలాంధ్ర-యడ్లపాడు : లింగారావుపాలెం గ్రామంలో కొండవీటి కళాపరిషత్ 24వ జాతీయస్థాయి ఆహ్వాన నాటికల పోటీలు ఈ నెల 21వ తేదీ నుంచి ప్రారంభం కానున్నట్లు పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు కట్టా శ్రీహరిరావు, మండెపూడి శ్రీనివాసరావులు ఒక ప్రకటనలో మంగళవారం తెలిపారు. పరిషత్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ నెల 21, 22, 23 తేదీల్లో మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీలకు తొమ్మిది నాటిక ప్రదర్శనలు ఉంటాయన్నారు. ప్రతిరోజు సాయంత్రం 8.30 గంటలకు తొలి నాటిక ప్రారంభం అవుతుందని, అనంతరం సభా కార్యక్రమం, వెంటనే మరో రెండు నాటికలు ప్రదర్శితం అవుతాయని తెలిపారు. ఆయా కార్యక్రమాలకు కళాభిమానులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పుస్తకాలు, పెన్నులు పంపిణీ

విశాలాంధ్ర-వినుకొండ: మాచర్ల తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ జూలకంటి బ్రహ్మానంద రెడ్డి జన్మదిన వేడుకలలో భాగంగా పట్టణానికి చెందిన గంగినేని ఫౌండేషన్ వ్యవస్థాపకులు గంగినేని రాఘవ ఆధ్వర్యంలో వారిని కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం నిరుపేద కుటుంబాలలోని చిన్నారులను చదువుకునే విధంగా ప్రోత్సహించే కార్యక్రమంలో భాగంగా పిలుపునిచ్చిన జూలకంటి బ్రహ్మారెడ్డి విజ్ఞప్తి మేరకు గంగినేని ఫౌండేషన్ తరపున పుస్తకాలు, పెన్నులు అందజేశారు. ఈ సందర్భంగా జూలకంటి వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో గంగినేని బాబు, సోమేపల్లి శ్రీనివాసరావు, ఆచారి తదితరులు పాల్గొన్నారు.

జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం

విశాలాంధ్ర - నకరికల్లు : మండల కేంద్రమైన నకరికల్లులో మంగళవారం మా నమ్మకం నువ్వే జగనన్న స్టిక్కర్లను బంగ్లా గడ్డ ఏరియాలో పర్యటించి ఇంటింటికి అంటించారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వాలంటీర్లు, వైకాపా నాయకులు ప్రతి గడపకు తిరుగుతూ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలు కొనసాగాలంటే జగనన్న ప్రభుత్వం తిరిగి 2024లో అధికారంలోకి రావాలన్నారు. జగనన్న ప్రభుత్వం ద్వారానే రాష్ట్ర అభివృద్ధి జరుగుతుందన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తమకు తెలియజేస్తే వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించేందుకు కృషి చేస్తామని నాయకులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి మెంబర్ షేక్.సలీం, సచివాలయం -2 కన్వీనర్ షేక్.హసీనా, వాలంటీర్ షేక్.సైదా, గృహసారధి షేక్.మస్తాన్, వైకాపా నాయకులు దావూద్ తదితరులు పాల్గొన్నారు.

సత్తెమ్మతల్లిని దర్శించుకున్న ఎమ్మెల్యే

విశాలాంధ్ర-పెదకూరపాడు రూరల్ : అచ్చంపేట మండల పరిధిలోని కొండూరు గ్రామ శివారు శ్రీనివాసతండాలో కొలువైఉన్న శ్రీ సత్తెమ్మతల్లి 5వ వార్షికోత్సవంలో పెదకూరపాడు శాసనసభ్యులు నంబూరు శంకరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆ అమ్మవారి దయవల్ల నియోజకవర్గంలో ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో, పాడి పంటలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు చిలకా చంద్రయ్య, జడ్పీటీసీ సభ్యులు తుమ్మ విజయ ప్రతాపరెడ్డి, అచ్చంపేట సర్పంచి కంబాల వీరబాబు, నెల్లూరు చంద్రబాబు, అంబటి నారాయణ, షేక్ బాజీ, సాయిరెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, వైసీపీ కార్యకర్తలు విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

మట్టి ఖర్చులు అందజేత

విశాలాంధ్ర-దుర్గి : మండల కేంద్రమైన దుర్గికీ చెందిన బైనా లక్ష్మీకి రూ.10వేలు నగదును మంగళవారం యార్డు ఛైర్మన్ వెలిదండి గోపాల్, సర్పంచ్ రాయపాటి మాణిక్యం అందజేశారు. ఇటీవల బైనా కొండలు అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ మేరకు మట్టి ఖర్చుల నిమిత్తం నగదును మృతుని భార్యకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.యశోద, వాలంటీరు తురకా సత్యం ఉన్నారు.

గ్రావెల్ అక్రమ తవ్వకాలపై టీడీపీ నిరసన

విశాలాంధ్ర-దుగ్గిరాల : తాడేపల్లి మండలం ఉండవల్లిలో గ్రావెల్ క్వారీలో అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయని మంగళవారం నిరసన తెలిపి బైఠాయించిన టీడీపీ నేతలు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకొని దుగ్గిరాల పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వీరికి మండల నాయకులు సంఘీభావం తెలియజేశారు. పోలీస్ స్టేషన్‌కు తరలించిన వారిలో గుంటూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకటరావు, మంగళగిరి పట్టణ అధ్యక్షులు అమరా సుబ్బారావు, రూరల్ అధ్యక్షులు తోట పార్థసారథి, టౌన్ అధ్యక్షులు దామర్ల రాము, రాష్ట్ర యువ నాయకులు జవ్వాది కిరణ్ చంద్, షేక్ హుస్సేన్, బుడే, రియాజ్, దుర్గారావు, వెంకటేశ్వరరావు, నాగార్జున, పడవల మహేష్, శంకర్రావు, హరికృష్ణ, నాగేశ్వరరావు, కళ్యాణ్ స్టేషన్లో ఉండగా వారికి మండల నాయకులు రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి గూడూరు వెంకట్రావు, తాళ్ల అశోక్ యాదవ్, వాసిరెడ్డి శ్రీనివాస్, వల్లూరు నరసింహారావు, దేవరపల్లి చంటి, నక్కా చిరంజీవి, కాకా బాబు, ప్రసంగి కొండలు, షేక్ బాషా, మొద్దుకూరు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

13న జాతీయ లోక్‌అదాలత్

విశాలాంధ్ర-తెనాలి : మే 13న తెనాలిలో జాతీయ లోకదాలత్, జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మండల న్యాయసేవాధికార సంస్థ తెనాలి వారి ఆధ్వర్యంలో జాతీయ లోకదాలత్ నిర్వహించబడునని తెనాలి 11వ అదరపు జిల్లా జడ్జి జి.మాలతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

బీజేపీని సాగనంపుదాం.. దేశాన్ని కాపాడుకుందాం

- జిల్లా సీపీఐ కార్యదర్శి మారుతీవరప్రసాద్
- కొనసాగుతున్న వామపక్షాల ప్రచార యాత్ర

విశాలాంధ్ర-వినుకొండ రూరల్ : దేశంలో ప్రజా వ్యతిరేక, రైతువ్యతిరేక, అప్రజాస్వామిక, మతోన్మాద విధానాలను కొనసాగిస్తున్న బీజేపీని సాగనంపుదాం దేశాన్ని కాపాడుకుందాం అనే నినాదంతో వామపక్షాల ఆధ్వర్యంలో ఈ ప్రచార యాత్ర కార్యక్రమం 5వ రోజు జరుగుతోందని సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్ అన్నారు. దేశ్ కి బచావో బీజేపీ హటావో నినాదంతో వామపక్షాలు సీపీఐ, సీపీఎం చేపడుతున్న ప్రచార బేరి కార్యక్రమంలో భాగంగా వినుకొండ రూరల్ ప్రాంతంలో ఉన్నటువంటి జగనన్న కాలనీని వామపక్షాల బృందం సందర్శించిన సందర్భంగా వారితో కలిసి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఈ ప్రచార పాదయాత్ర కార్యక్రమం ఈ రోజు ప్రత్యేకంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రతిష్టగా భావించిన జగనన్న కాలనీల పరిస్థితులను పరిశీలిద్దామని వచ్చామని కానీ ఈ కాలనీలో 4000 పైచిలుకు ఇళ్ల స్థలాలు ఇచ్చారనీ కొన్ని గృహాల నిర్మాణం జరుగుతున్నప్పటికిని అస్తవ్యస్తంగా నిర్మాణాలు జరుగుతున్న గృహాలు పూర్తిగా నాణ్యతా లోపంతో ఉన్నాయని అప్పుడే గోడల పెచ్చులు ఊడిపడుతున్నాయని కదిలి పోతున్నాయని వారు విమర్శించారు. జగనన్న కాలనీలు ప్రారంభించి రెండు సంవత్సరాలు గడుస్తున్నా ఇంతవరకు పూర్తిస్థాయిలో ఇళ్ల నిర్మాణం పూర్తి కాలేదని ఆ కాలనీలకు మౌలిక వసతులు కూడా ఏర్పాటు కాలేదని విమర్శించారు. ఈ పరిస్థితుల్లో మరొక సంవత్సరకాలం లోపల ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో పేద ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం పూర్తిస్థాయి నాణ్యత విలువలు కలిగిన గృహాలను ఎప్పుడు నిర్మిస్తారని ప్రజలకు ఇచ్చిన మాట ఎప్పుడు నెరవేరుతుందని మారుతి ప్రశ్నించారు. ఇదిలా ఉంటే రాష్ట్రంలో మోయలేని పెను భారాలతో సామాన్య ప్రజలు అల్లాడిపోతున్నారని ఆయన విమర్శించారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు, సీపీఎం పట్టణ కార్యదర్శి బొంకూరు వెంకటేశ్వర్లు, రైతు సంఘం నాయకులు ఉలవలపూడి రాము తదితరులు మాట్లాడుతూ దేశంలో బీజేపీ అధికారం చేపట్టిన నాటి నుంచి పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను విపరీతంగా పెంచి ప్రజలను తీవ్ర ఆందోళనలకు గురిచేస్తుంటే మరోవైపు ప్రధాని మోదీ ఎన్నికల సందర్భంగా తాను ఇచ్చిన హామీలను అమలుపరచకపోగా అందుకు విరుద్ధంగా మొత్తం దేశ సంపదలను గుత్తపెట్టుబడిదారులకు దారదత్తం చేస్తూ దేశాన్ని దివాలా తీయిస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆనాటి కమ్యూనిస్టు నాయకులు శాసనసభ, పార్లమెంటు సభ్యత్వాల పదవి త్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని అదానీకి, అంబానీకో కట్టబెడుతుంటే అడ్డుకోవాల్సిన రాష్ట్ర ప్రభుత్వం చోద్యం చూస్తూ ఉందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి వ్యతిరేకంగా కార్మికులు నిత్యం పోరాటాలు కొనసాగిస్తున్నారని సీపీఐ, సీపీఎం పాదయాత్రలు చేస్తూ కార్మికులను ప్రజలను చైతన్యవంతం చేస్తున్నట్లు తెలిపారు. రూ.400లకు ఉన్న గ్యాస్ ధర మోదీ పాలనలో రూ.1200లకు పెరిగిందని ఇది సామాన్యులకు ఎంతో భారంగా ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విధంగా మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ఆర్థిక అరాచకాలను ప్రజలు ప్రశ్నించకుండా ఉండేందు కోసం కులాలు మతాల పేరుతో ఉన్మాదాలను రెచ్చగొడుతూ దేశంలో అల్లర్లు సృష్టిస్తూ బీజేపీ పబ్బం గడుపుకుంటుందని మరోసారి బీజేపీ గెలిస్తే దేశంలో ఆర్థిక అరాచకం ప్రబలే ప్రమాదం ఉందని దీన్ని గుర్తించిన వామపక్షాలు బీజేపీని సాగనంపేందుకు దేశాన్ని కాపాడుకునేందుకు ప్రజలను చైతన్యపరచడం కోసం ప్రచార భేరి కార్యక్రమం చేపట్టినట్లు వారు తెలిపారు. ఈ ప్రచార కార్యక్రమాలలో ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని చైతన్యవంతులు కావాలని పిలుపునిచ్చారు. బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న అప్రజా స్వామిక విధానాలు రాష్ట్ర విభజన సందర్భంగా కేంద్రం ప్రకటించిన హామీలను సాధించుకోవడంలో జగన్‌మోహన్ రెడ్డికి చిత్తశుద్ధి లేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలను తనకు అనుగుణంగా మార్చుకోవడానికి సీబీఐ, ఈడీ కేసులను బయటకు తీసి బెదిరిస్తోందన్నారు. ప్రజలు సంఘటితమై పోరాడాలని పిలుపునిచ్చారు. సీపీఐ పట్టణ కార్యదర్శి రాము, నాయకులు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పిన్నిబోయిన వెంకటేశ్వర్లు, సీపీఐ వినుకొండ మండల కార్యదర్శి సాగర్, సోడాల సాంబయ్య, రమణయ్య, శ్రీనివాసరావు నూజెండ్ల మండల కార్యదర్శి ఏ.పవన్ కుమార్, తెల్లమేకల శ్రీనివాసరావు, మల్లికార్జునరావు, సీపీఎం రంజాన్ బి, తిరుమల లక్ష్మి, నాసర్ బి, రాజ్యం, కొమ్ము సోమయ్య, ముని వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ దుర్మార్గాలను నిలదీయాలి

విశాలాంధ్ర-చిలకలూరిపేట : ప్రజావ్యతిరేక విధానాలు అవలింభిస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని సాగనంపటానికి ప్రతిఒక్కరూ కలసిరావాలని సీపీఐ, సీపీఎం పట్టణ కార్యదర్శులు పేలూరి రామారావు, పేరుబోయిన వెంకటేశ్వర్లు కోరారు. ప్రచారం భేరి కార్యక్రమంలో భాగంగా మంగళవారం చిలకలూరిపేట మండలంలోని గ్రామాలలో ప్రచారం నిర్వహించారు. కరపత్రాలు పంపిణీ చేసి, ప్రజల్లో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న నిరంకుశ విధానాలను గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సంక్షేమాన్ని విస్మరించి ప్రభుత్వరంగ పరిశ్రమల్ని ఓడరేవుల్ని, 'అఖరికి మన అందరికీ అన్నం పెట్టే వ్యవసాయాన్ని సైతం కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తోందని విమర్శించారు. మోదీ అండదండలతో అదానీ ఏ విధంగా ప్రపంచాన్ని మోసం చేసి లక్షల కోట్లు కొల్లగొట్టాడో హిడెన్‌బర్గ్ నివేదిక బట్టబయలు చేసిందని, అయినా దానిమీద విచారణకు అంగీకరించకుండా అదానీని ఈ కేంద్ర ప్రభుత్వం వెనకేసుకువస్తోందని ఆరోపించారు. వేగంగా దేశంలోని అడవులను, భూములను, విద్యుత్తు ప్రాజెక్టులను, గనులను కార్పొరేట్లకు ఆక్రమంగా కట్టబెడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి వ్యక్తి కేంద్ర ప్రభుత్వ దుర్మార్గాలను నిలదీయాలని, లేకుంటే దేశ ప్రజల భవిష్యత్తు చీకటిమయమైపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అనేక మతాల, కులాల, భాషల, సంస్కృతులతో కూడిన భారతదేశంలో ప్రజల మధ్య విద్వేషపు చిచ్చు రాజేస్తున్నారని, మైనారిటీలకు భరోసా కల్పించడం పోయి వారిని దేశంలోనే లేకుండా తుడిచిపారేయాలన్న విధ్వంసకర విధానాలను తెస్తున్నారని ఆరోపించారు. మతోన్మాద విద్వేషపు మంటల్లో మాడి మసైపోకుండా కాపాడుకోవలసిన బాధ్యత ప్రతీ దేశ భక్తుడిపైనా ఉందన్నారు. మహిళల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బకొట్టి అడిగినుడిగి ఉండాలని సుభాషితాలు చెప్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మురికిపూడి, తాతపూడి, రాజాపేట, బొప్పూడి, పోతవరం, మద్దిరాల, యడవల్లి, కట్టుబడివారి పాలెం, కావూరు, వేలూరు, దండమూడి ప్రాంతాలలో పర్యటించారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ సుబాని, నాయకులు విల్సన్, చౌటుపల్లి నాగేశ్వరరావు, సుభాష్, బొంతా నాగేశ్వరరావు, కోట్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్త సైనికుల్లా పని చేయాలి: జీవీ

విశాలాంధ్ర-వినుకొండ: వైసీపీ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకుపోతు ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సమర్థవంతంగా ఎదుర్కొనే విధంగా ప్రతి కార్యకర్త సిద్ధంగా ఉండాలని పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పిలుపునిచ్చారు. మంగళవారం వినుకొండ టిడిపి కార్యాలయంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు పి.వి.సురేష్ బాబు అదక్షతన ఏర్పాటుచేసిన విస్తృతస్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో వైసిపి పగదాలపై, అసమర్ధ పాలనపై టిడిపి శ్రేణులు పోరాడుతూ ప్రజల్లో చైతన్యం చెప్పాలని కోరారు. ఓట్లను తారుమారు చేస్తున్నారని, ప్రతి బూతు ఓటర్ జాబితాను ఎప్పటికప్పుడు పరిశీలించి మార్పులు చేర్పులపై అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. వినుకొండ పట్టణంలో టిడిపి బలోపేతానికి నాయకులు కార్యకర్తలు ఐక్యంగా ముందుకు వెళ్లి కృషి చేయాలన్నారు. రాష్ట్రానికి ఇదేమి కర్మ కార్యక్రమం వార్డుల్లో వేగవంతంగా కొనసాగించాలని వివరించారు. రాష్ట్రంలో జరుగుతున్న ప్రజా వ్యతిరేక పాలన, వినుకొండలో ఎమ్మెల్యే బోల్లా బ్రహ్మనాయుడు చేస్తున్న అవినీతి, అక్రమాలు, దౌర్జన్యాలు, అరాచక విధానాలను ఇంటింటికి తీసుకువెళ్లి వివరించాలని తెలిపారు. సమావేశంలో నియోజకవర్గ పరిశీలకులు మానుకొండి శివ ప్రసాద్, క్లస్టర్ ఇంఛార్జిలు సౌదాగర్ జానీ బాషా, పత్తి పూర్ణచంద్రరావు, రాష్ట్ర టిడిపి కార్యదర్శి శమీమ్ ఖాన్, పళ్ళమీసాల్ దాసయ్య, మోటమర్రు నరసింహారావు, గ్రంధం కోటేశ్వర రావు, గట్టుపల్లి శ్రీను,అయిబ్ ఖాన్,కళింగ శ్రీను, సుంకర శ్రీనివాసరావు, డాక్టర్ చలపతిరావు, గొల్ల మస్తాన్ రావు, గ్రంధం సుబ్బరావ, జానీ రియల్ ఎస్టేట్, కళింగ రాజు, మహిళలు ముప్పిరి చౌదమ్మ, బొట్లగుంట లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర-మంగళగిరి : మండలంలోని నిడమర్రు గ్రామంలో గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ స్వచ్ఛంద సేవా సంస్థ చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్ట్ ఇంచార్జ్ సిస్టర్ లతా ఆధ్వర్యంలో బాలల హక్కుల పరిరక్షణ కోసం స్టెటంతనింగ్ ఆఫ్ కమ్యూనిటీ బేస్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో నేలటూరి నాగమణి మాట్లాడుతూ చైల్డ్ ప్రొటెక్షన్ కమ్యూనిటీ కమిటీ బాలలపై జరుగుతున్న లైంగిక వేధింపులు, లైంగిక నేరాలు, మానవ అక్రమ రవాణా లింగ వివక్షత లాంటివన్నీ రూపుమాపాలంటే విలేజ్ లెవెల్ ప్రొటెక్షన్ కమిటీ ఏర్పాటు చేయాలని తెలియజేశారు. ఈ ప్రొటెక్షన్ కమిటీ ఎన్నుకోవడం జరిగింది చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ ప్రెసిడెంట్‌గా నిడమర్రు గ్రామం మహిళా పోలీస్ సత్య సెక్రటరీగా అంగన్వాడి టీచర్ జ్యోతి ఎన్నుకోవడం జరిగింది. ఈ కమిటీలో ఆశ వర్కర్ ఉష యానిమేటర్ ఎస్తేర్ రాణి, వాలంటీర్ ఎం.లక్ష్మి, మహిళా గ్రూప్ సభ్యురాలు సంధ్య, యూత్ కమిటీ నుండి సూర్య ప్రకాష్, చిల్డ్రన్స్ పార్లమెంట్ ప్రధానమంత్రి స్టాలిన్ కిషోర్ బాలికల ప్రెసిడెంట్ మాధురి 12 మందితో ఈ కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది.

కల్తీ ఆహారం నుంచి ప్రజలను కాపాడండి: కాసా

విశాలాంధ్ర-నరసరావుపేట: పట్టణంలో చిన్నపిల్లలు తాగే పాల దగ్గర్నుంచి నిత్యవసర సరుకులు వరకు వ్యాపారులు కల్తీలు చేసి అమ్ముతున్నారని, ఈ కల్తీలను అరికట్టాలని సీపీఐ సహాయ కార్యదర్శి కాసా రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హెూటల్లో నాణ్యమైన ఆహారం అందించడంలో పట్నంలోని యాజమాన్యాలు చాలావరకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని, ప్యాకింగ్ చేసినప్పటికీ వాటిల్లో పురుగులు విలయతాండం చేస్తున్నాయని, మరోపక్క తినే మామిడి పండ్లు, పచ్చ అరటికాయలు గోదాముల్లో మందులతో వాటిని మగ్గబెడుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని వాటి వల్ల ప్రజలు పిల్లలు అనారోగ్యంతో హాస్పటల్‌పాలు అవుతున్నారని అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారని, ఇష్టానుసారంగా తినుబండారాలను అమ్ముతున్న పట్టించుకునే నాధుడే లేనని అన్నారు. సిపిఐ పట్టణ కార్యదర్శి వైదన వెంకట మాట్లాడుతూ మరోపక్క మినరల్ వాటర్ ప్లాంట్స్ ఎక్కువ మోతాదులో రసాయనాలు కలిపి ప్రజలకు విక్రయిస్తున్నారని వాటిని కంట్రోల్ చేసే బాధ్యత ఏ ఒక్క అధికారికి లేదని వాటిని వెంటనే తనిఖీ చేసి పరిశుభ్రమైన మంచినీళ్లను పట్టణ ప్రజలకు అందించాలని లేని పక్షాన సిపిఐ పక్షాన పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని అన్నారు. సిపిఐ సీనియర్ నాయకులు పగడాల కోటేశ్వరావు, హర్ష రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉప్పొంగిన అభిమాన సాగరం

విశాలాంధ్ర-రెంటచింతల : మాచర్ల నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్ జూలకంటి బ్రహ్మారెడ్డి జన్మదిన వేడుకలు సందర్భంగా మంగళవారం రెంటచింతలలో ఆయన అభిమానులు టీడీపీ నేతలు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చి ఉత్సాహంగా భారీ ర్యాలీ నిర్వహించారు. గ్రామ పొలిమేరల నుంచి బయలుదేరిన ర్యాలీలో పాల్గొన్న బ్రహ్మారెడ్డి రోడ్డు కిరువైపులా ఉన్న ప్రజానీకానికి అభివాదాలు తెలుపుతూ ముందుకు సాగారు. టీడీపీ జెండాలు, బ్రహ్మ రెడ్డి చిత్రపటాలతో కూడిన మోటార్ సైకిళ్లు, వాహనాలు, బాణాసంచా పేలుళ్ల నడుమ కార్యకర్తల నినాదాలతో ప్రధాన రహదారి ప్రతిధ్వనించింది. ఆయనకు మెడలో పెద్ద గజమాలను వేసేందుకు భారీ క్రేన్ తెప్పించి కార్యకర్తలు అభిమానం చాటుకున్నారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల నుంచి నేతలు కార్యకర్తలు ర్యాలీలో పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మండల టీడీపీ అధ్యక్షుడు చపారపు అబ్బిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ గొంటు సుమంత్ రెడ్డి, టౌన్ అధ్యక్షుడు మూలి రాజారెడ్డి ఆయన వాహనంపై నిల్చుని కార్యకర్తలకు ఉత్సాహం కలిగించారు. ర్యాలీలో సీనియర్ నేత దండే శివయ్య, చేర్రెడ్డి కృష్ణారెడ్డి, నల్లబిరుదు నరసింహ రావు, కావూరి నాగయ్య, ముని నాయక్, మల్లయ్య యాదవ్, జ్ఞానయ్య, మామిడి రవి, సంసోన్, మరియదాస్, లింగా పున్నారావు, పాల్వాయి నర్సిరెడ్డి, మారాసు శ్రీనివాసరావు తదితర టీడీపీ నేతలు పాల్గొన్నారు.

ప్రధాన రహదారులు పరిశీలించిన ఆర్ అండ్ బీ శాఖ

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : తూర్పు నియోజకవర్గం నుంచి నగరం బయటకు వెళ్ల ప్రధాన రహదారులను అభివృద్ధి చేసేందుకు ఆర్ అండ్ బీ అధికారులు పరిశీలించారు. ఈ మేరకు మంగళవారం పాతగుంటూరు ప్రధాన రహదారి నందివెలుగు రోడ్డులో పరిశీలించగా నగరపాలక సంస్థ తరుపున విస్తరణ పనులు పూర్తి చేశారని, పూర్తి స్థాయిలో రైల్వే గేటు వరకు అభివృద్ధి చేయాలని తూర్పు వైసీపీ మహిళా నాయకురాలు నూరి ఫాతిమా, కార్పొరేటర్లు మొహమూద్, యిర్రి ధనలక్ష్మిలు ఆర్ అండ్ బీ సూపరింటెండెంట్ నిర్మలాదేవి, డీఈ రాజేంద్రనాయుడును కోరారు. వాహనదారులు, స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, మరమత్తులు పనులు కాకుండా నూతనంగా రహదారిని అభివృద్ధి చేయాలని అధికారులను కోరారు.

ప్రజల ఆస్తులకు రక్షణ కరవు..

దౌర్జన్యంగా ఆక్రమించుకుంటున్న అధికార పార్టీ నేతలు, అనుచరులు

విశాలాంధ్ర-వినుకొండ: పట్టణంలో కొందరు అధికార పార్టీ నాయకులు, అనుచరుల దౌర్జన్యాలు, అరాచకాలకు ప్రజల ఆస్తులకు రక్షణ కరువైంది. కోర్టు వివాదాల్లో ఉన్న కేసుల్లో కూడా అతిక్రమిస్తూ అక్రమంగా నిర్మాణాలను కూల్చివేసి జాగా ఆక్రమిస్తున్నారు. ప్రజల ధన,మాన, ప్రాణాలకు రక్షణ కల్పించాల్సిన అధికారులు పాలకులకు తొత్తులుగా మారి ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్నారు. వినుకొండ పట్టణంలోని తిమ్మాయపాలెం రోడ్డులో శశి ధరణి స్వీట్ తయారీ కేంద్రంతోపాటు మరో ఇల్లు నిర్మాణాలను అక్రమంగా కూల్చివేసి కబ్జాకు పాల్పడ్డారు. బాధితుడు కామ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వైసీపీ వర్గీయులు సుమారు 150 మంది తన ఇంటిపై మూక్కుమడి దాడి చేసి స్వీట్ షాపు, ఇట్టి నిర్మాణాలను దౌర్జన్యంగా కూల్చివేసి అడ్డుకునేందుకు వెళ్లిన మా కుటుంబ సభ్యులపై దాడి చేసి గాయపరిచారని ఆవేదన వ్యక్తం చేశాడు. వినుకొండ అధికారపార్టీ ప్రజా ప్రతినిధి అండతోనే తమ ఇంటిపై దాడి చేసి నిర్మాణాలను కూల్చివేసి స్థలాన్ని కబ్జా చేసుకున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. కోర్టు వివాదంలో ఉన్న స్థలానికి, నిర్మాణాలపై కోర్టు ఉత్తర్వుల మేరకే చర్యలు తీసుకోవాల్సి ఉంది. కానీ అధికారుల ప్రమేయం లేకుండా కొందరు వైసిపి నాయకులు, అనుచరులు మూకుమ్మడి దాడి చేసి నిర్మాణాలను కూల్చివేయటం చట్టం విరుద్ధమని, తమపై దౌర్జన్యం, దాడి, 25 లక్షల విలువ చేసే ఆస్తులను కూల్చివేసిన వారిపై అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు. లేనియెడల అధికారులతో పాటు దౌర్జన్యం చేసే ఆస్తి నష్టం చేసిన వ్యక్తులపై చర్యల నిమిత్తం న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని తెలిపారు.

ప్రకటన

మహారాజశ్రీ పిడుగురాళ్ళ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. No. 143 / 2020

Between:
కొలిశెట్టి అనంతరామయ్య ....వాది
మరియు
తెల్ల జయప్రకాష్ వగైరాలు ...ప్రతివాదులు

To,
3వ ప్రతివాది: నాళం తులశిదళం, భర్త. నరసింహారావు,డోర్.నెం.13-10, వాసవి కన్యకా పరమేశ్వరి గుడి ఎదురుబజారు, జానపాడురోడ్డు, పిడుగురాళ్ళ.

పైనెంబరు దావాలో పరిహారం నిమిత్తం వాది దావావేసియుండుట వలన దావాలోని 3వ ప్రతివాది తాను స్వయముగా కాని లేక న్యాయవాది ద్వారా కాని ది.24-04-2023న ఉ॥గం॥10-30ని॥లకు పై కోర్టులో హాజరై తన యొక్క అభ్యంతరములు వ్రాతమూలముగా తెలుపుకొనగలరు. అట్లు హాజరుకాని యెడల ప్రతివాది పరోక్షమునందు దావాను పరిశీలించి తగిన తీర్మానము చేయగలరని పై కోర్టు వారు ఈ ప్రకటన ద్వారా తెలియచేయమన్నందున తెలియచేయటమైనది.

రెడ్డి సాంబశివరావు, వాది తరపు న్యాయవాది.
సెల్: 9440438199

పోరాటాల్లో ప్రజలు భాగస్వాములు కావాలి

విశాలాంధ్ర-అమరావతి : సంపదను సృష్టించే ప్రభుత్వ సంస్థలను కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేస్తూ దేశాన్ని అప్పుల ఊబిలోకి నెడుతూ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు విస్మరించి హద్దు అదుపు లేకుండా పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెంచి పెద్ద నోట్ల రద్దుతో ప్రజల జీవన విధానంపై తీవ్రమైన సంక్షోభాన్ని సృష్టిస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాన్ని ఎండగడుతూ దానికి తానా అంటే తందా నగా వ్యవహరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ విధానాన్ని తూర్పారబట్టేందుకు సీపీఐ నిర్వహించే ప్రజా పోరాటాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని సీపీఐ నాయకులు, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి బైరాపట్నం రామకృష్ణ పిలుపునిచ్చారు. సీపీఐ పిలుపులో భాగంగా ప్రచార బేరి కార్యక్రమంలో పాల్గొని ప్రసంగిం చారు. మంగళవారం అమరావతిలో నిర్వహించిన సీపీఐ ప్రచార కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అదానీ, అంబానీల జపంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ప్రజాకంతక పాలనపై సభ్యస మాజం ముక్తకంఠంతో ఖండించాలని కోరారు. సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రచార బేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రామకృష్ణ కోరారు. ఈ సందర్భంగా ప్రజలపై పరోక్షంగా ప్రత్యక్షంగా చేస్తున్న దాడులపై కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ కార్యకర్తలు తోట అంజి, గాలం సాంబశివరావు, యుగంధర్, ఏసుబాబు, కోటయ్య, గౌస్, నాగరాజు, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

ఈద్గా ప్రహరీ పనులు పరిశీలించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-మాచర్ల: మైనార్టీల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఈనెల 22న జరగనున్న రంజాన్ పండుగను పురస్కరించుకొని మంగళవారం పట్టణంలోని ఈద్గా ప్రహరీ గోడ, రహ్ మానియా మసీదు వాటర్ ప్లాంట్ స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పీఆర్కే మాట్లాడుతూ గడచిన సంవత్సర కాలంలో మాచర్ల, కారంపూడి, రెంటచింతల, దుర్గి మండలాల్లో మసీదులు, ఈద్గా, షాది ఖానా నిర్మాణాలకు రూ.1 కోటి 25 లక్షల రూపాయలు ఖర్చుపెట్టినట్టు ఆయన తెలిపారు. ఈ క్రమంలోనే పట్టణంలోని ఈద్గా చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణానికి రూ.33 లక్షల వ్యయంతో గోడ నిర్మాణం పూర్తి చేసినట్టు ఆయన పేర్కొన్నారు. అనంతరం రంజాన్ పండుగ నిర్వహణకు పురపాలక సంఘం కార్యాలయం నుండి రూ.75 వేల చెక్కును ముస్లిం మత పెద్దలకు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, ఉప్పలపాడు జానీ, షేక్ సులేమాన్, షేక్ దస్తగిరి, షేక్ సుభాని, షేక్ కరిముల్లా, షేక్ రహమాన్, మున్సిపల్ కమిషనర్ రమణబాబు తదితరులు పాల్గొన్నారు.

పేటలో సీపీఐ ప్రచార భేరి

విశాలాంధ్ర-నరసరావుపేట: పల్నాడు జిల్లా నరసరావుపేట పట్టణంలో మోడీ హటావో దేశ్ బచావో పిలుపులో భాగంగా మంగళవారం నరసరావుపేట పట్టణంలోని ఒకటో వార్డులో సిపిఐ పట్టణ కార్యదర్శి వైదన వెంకట్ ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అధికారులు వచ్చినప్పటి నుంచి దేశంలో పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర ధరలు సామాన్యులకు అందుబాటులో లేకుండా పోయాయని వాపోయారు. పేదల మరింత పేదలయ్యారని ధనవంతులు ఈ దేశంలో పెరిగిపోయారని అన్నారు, కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా కార్మిక వ్యతిరేక విధానాల పైన సిపిఐ పోరాటాలు నిర్వహిస్తుందని ఏప్రిల్ 14వ తేదీ నుండి 30 వరకు జరిగే ప్రచార యాత్రను జయప్రదం చేయాలని అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శీను, హర్ష, రాజు, సుబ్బు, సద్దాం తదితరులు పాల్గొన్నారు.

జూలకంటి బ్రహ్మారెడ్డి జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-మాచర్ల: టీడీపి మాచర్ల నియోజకవర్గం ఇంచార్జ్ జూల కంటి బ్రహ్మారెడ్డి జన్మదిన వేడుకలు మంగళవారం పట్టణ పరిధిలోని రాయవరం జంక్షన్‌లో ఘనంగా జరిగాయి. వేడుకలకు నియోజక వర్గంలోని గ్రామాల నుండి భారీగా నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. ముందుగా పుట్టినరోజు కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన గురజాల మాజీ ఎమ్మెల్యే తిరపతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ బ్రహ్మారెడ్డిది ముందు నుండి రాజకీయ కుటుంబమని, బ్రహ్మ రెడ్డి మచ్చలేని నాయకుడని అన్నారు. బ్రహ్మారెడ్డి పై ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, సోదరుడు పిన్నెల్లి వెంకటరామిరెడ్డి ఆరోపణలు చేయటం మానుకోవాలన్నారు. బ్రహ్మారెడ్డికి ప్రజాదరణ ఉందని, రానున్న ఎన్నికల్లో మాచర్ల నియోజకవర్గం నుండి 20వేల మెజార్టీతో గెలుపు ఖాయమని ఆయన అన్నారు. కార్యక్రమంలో దారూ నాయక్, కొమెర దుర్గారావు, నేరేటి వీరాస్వామి, కుర్రి శివారెడ్డి, పంగలూరి అంజయ్య, సాతులూరి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విజయపురిసౌత్: బ్రహ్మారెడ్డి జన్మదిన వేడుకలను విజయపురిసౌత్‌లో టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. విజయపురిసౌత్ టీడీపీ అధ్యక్షుడు బొల్లా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కార్యకర్తలంతా ఐక్యంగా ఉండి తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. టీడీపీ సీనియర్ నాయకులు ఎరిపల్లి వెంకటేశ్వర్లు, ఆడెపు కోటయ్య, మైలపల్లి అప్పలరాజు, సిహెచ్ అప్పలరాజు, నూకరాజు, పవన్ కుమార్, కట్టా రాజు, గోసల జగదీష్, సారడా రాజేష్, ఎరిపల్లి అప్పారావు యూత్ పాల్గొన్నారు.

దుర్గి: మండల కేంద్రమైన దుర్గిలో జూలకంటి బ్రహ్మారెడ్డి 59వ జన్మదిన వేడుకలను మంగళవారం రాత్రి భీమా అంజి, శెట్టిపల్లి నరసింహారావు, వెంకటేష్, పగడాల చెన్న, సూరె కృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. భారీ కటౌట్ ఏర్పాటు చేసి బర్త్ డే కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. అనంతరం పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నక్కనబోయిన కొండలు, పులగం నాగేశ్వరరావు, గై.గోపాల్, రాయపాటి కృపాదానం, పేరువాల ఏసోబ్, మెకానిక్ కొండలు, భీమా నాగేశ్వరరావు, శివ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పురపరిపాలన శాఖ
వినుకొండ పురపాలక సంఘం
'ఇ-ప్రొక్యూర్‌మెంట్' టెండరు నోటీసు

నిట్ నెం : 1275/2015/ఇ1 తేది : 17-04-2023

(1) పనిపేరు : వినుకొండ పురపాలక సంఘంనకు సంబంధించి 38 నెం.ల పనులకు సంబంధించి ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్లు పిలువబడుచున్నవి. (2) 34 నెం.ల పనులకు సంబంధించి టెండర్లు స్వీకరణకు చివరి తేది/సమయం. 24-04-2023, సాయంత్రం 4.00 గం. వరకు (3) 4 నెం.ల పనులకు సంబంధించి టెండర్లు స్వీకరణకు చివరి తేది / సమయం. 02-05-2023, సాయంత్రం 4.00గం వరకు (4) సంబంధిత మునిసిపల్ కమిషనరు పేరు : శ్రీ బి.శ్రీనివాసులు, కమిషనరు, వినుకొండ పురపాలక సంఘము, ఫోన్ నెం. 08646-273656, మున్సిపల్ ఇంజనీరు, వారి సెల్ నెం. 9704222504 తదుపరి వివరములను http://tender.apeprocurment.gov.in వద్ద ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ నందు చూడవచ్చును.

కమిషనర్,
వినుకొండ పురపాలక సంఘం

విశాలాంధ్ర బాపట్ల జిల్లా

అనాథ బాలలకు ఆర్థిక చేయూత

విశాలాంధ్ర-అద్దంకి : మిషన్ వాత్సల్య పథకం ద్వారా అనాథ బాలలకు ఆర్థిక చేయూత చేకూరుతుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమీషన్ సభ్యురాలు శ్రీమతి బత్తులయ పద్మావతి అన్నారు. పథకం గురించి మంగళవారం పట్టణంలోని ప్రకాశం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మండలస్థాయి అధికారులు, ఉపాధ్యాయులతో అవగాహనా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పద్మావతి మాట్లాడుతూ పాఠశాలల్లో తల్లిదండ్రులను కోల్పోయిన 18 సంవత్సరాలలోపు విద్యను అభ్యసిస్తున్న అనాథ బాలలను ప్రభుత్వం గుర్తించి నిబంధనల ప్రకారం అర్హులైన బాలలకు నెలకు రూ.4వేలు ఆర్థిక భరోసా కల్పిస్తారన్నారు. గ్రామ,వార్డు స్థాయిలో గల సచివాలయం, ఉపాధ్యాయ, అంగన్వాడి, వాలంటీర్లను ఇందులో భాగస్వామ్యం కావాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్ఈవో పి.వి రాఘవరావు, ఎస్సై ఆదిలక్ష్మి, ఉపాధ్యాయులు, అంగన్వాడి సూపర్వైజర్లు, పేరెంట్స్ కమిటి చైర్మన్ పేరం సుధాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దహార్తి తీర్చటానికి చలివేంద్ర దోహదం

విశాలాంధ్ర-పర్చూరు: వేసవిలో ప్రయాణికులకు, కార్మికులకు, గ్రామస్తులకు దహార్తిని తీర్చటానికి చలి వేంద్రం దోహదపడుతుందని పంచాయతీ కార్యదర్శి కట్టా రాణి తెలిపారు. బొమ్మల సెంటర్లో రోటరీ క్లబ్, పర్చూరు గంగా ఆధ్వర్యంలో కొమ్మాలపాటి బ్రహ్మానందం జ్ఞాపకార్థం తోకల కృష్ణమోహన్ సహకారంతో ఏర్పాటు చేసిన చలివేంద్రంను రాణి ప్రారంభించారు. మజ్జిగ పంపిణీని ఏఎస్సై పి.కోటేశ్వరరావు ప్రారంభించారు. రోటరీ అధ్యక్షులు నాగభైరు శ్రీనివాసరావు, సపోర్టు అధ్యక్షులు పోలిశెట్టి చంద్రం, రోటరీ ట్రస్ట్ అధ్యక్షులు గడ్డిపాటి శ్రీనివాసరావు, ప్రతినిధులు కోటా శ్రీనివాసరావు, కొల్లా నరేంద్రకుమార్ ఉన్నారు.

చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

విశాలాంధ్ర - చీరాల : ప్రతి రోజు భోజనం ముందు, మల విసర్జన తర్వాత తప్పనిసరిగా చేతులను సబ్బుతో శుభ్రపరుచు కోవాలని ప్రధానోపాధ్యాయులు బి సాల్మన్ రాజు అన్నారు.ఆంధ్రరత్న మున్సిపల్ హైస్కూల్ పేరాలలో నేడు డెటాల్ బనేగా స్వాస్థ ఇండియా కార్యక్రమాన్ని నిర్వహించి చేతుల పరిశుభ్రత పై అవగాహన కల్పించారు. డెటాల్ స్వాస్థ్ బనేగా ఇండియా సమన్వయకర్త కమురుద్దీన్, సైన్స్ ఉపాధ్యాయులు పవని భానుచంద్రమూర్తి, శ్రీనివాసులు,చంద్ర శేఖర్,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రక్షణ చర్యలు తీసుకోండి

విశాలాంధ్ర - చీరాల : నైట్ వాచ్మెన్ లేకుండా స్టాఫ్ నర్సును నైట్ డ్యూటీ చేయమని వైద్యాధికారులు ఒత్తిడి చేస్తున్నారని ఎటు వంటి రక్షణ చర్యలు లేకుండా స్టాఫ్ నైట్ డ్యూటీ చెయ్యాలని స్టాఫ్ పై ఒత్తిడి తీసుకురావద్దని తగిన రక్షణ చర్యలు చేపడితేనే నైట్ డ్యూటీ చేస్తామని ఏపీ గవర్నమెంట్ నర్సింగ్ అసోసియేషన్ ప్రకాశం జిల్లా నాయకులు అన్నారు. ఏపీ గవర్నమెంట్ నర్సింగ్ అసోసియేషన్ ఆధ్వ ర్యంలో బాపట్ల వైద్య ఆరోగ్యశాఖ అధికారి శ్రీమతి డాక్టర్ ఎస్ విజయమ్మని కలసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో స్టాఫ్ నర్స్ పడుతున్న ఇబ్బందులు గురించి మెమోరాండం అందించారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టియుసి జిల్లా అధ్యక్షులు చింతా శేషు బాబు, ఎపి గవ్నమెంట్ నర్సెస్ అసోసియేషన్ అధ్యక్షులు కొత్తపల్లి మంజేష్,ప్రధాన కార్యదర్శి ఎం ఉదయ లక్ష్మీ,వైస్ ప్రెసిడెంట్ ఏ వందనా దేవి, విజయ్ కుమార్,ఎం మహేష్,షేక్ జానీ భాష, రమణా నాయక్,జానీ భాష ,హాజన్ నాయక్,తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఆధ్వర్యంలో రంజాన్ తోఫా పంపిణీ

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : బాపట్ల నియోజక వర్గంలోని ముస్లిం పెద్దలకు ఇమాములకు, మౌజాలకు రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ ఇంచార్జ్ వైఎస్ నరేంద్రవర్మరాజు మాట్లాడుతూ ప్రతి ఏడాది మాదిరిగానే తెలుగుదేశం పార్టీ నేతృత్వంలో ముస్లింలకు రంజాన్ తోఫా అందించే గొప్ప అవకాశం కలగడం శుభ సూచకమన్నారు. ఈ కార్యక్రమంలో మస్తాన్ వలి, అబ్రార్, పట్నం పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసరావు ఉన్నారు.

అందరి సహకారంతో జిల్లా పురోభివృద్ధి సాధిద్దాం: కలెక్టర్

విశాలాంధ్ర - బాపట్ల : జిల్లాలోని అన్నీ శాఖల అధికారులతో జిల్లా పురోభివృద్ధి సాధిద్దామని జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా చెప్పారు. బాపట్ల జిల్లా నుంచి బదిలీపై వెళ్లిన పూర్వ కలెక్టర్ కె.విజయకృష్ణన్, పూర్వ జిల్లా సంయుక్త కలెక్టర్ డా. కె శ్రీనివాసులుకు వీడ్కోలు, నూతన కలెక్టర్గా బాధ్యతలు స్వీకరించిన పి.రంజిత్ బాషా, జిల్లా సంయుక్త కలెక్టర్ సిహెచ్ శ్రీధర్లకు ఆహ్వాన అభినందన సన్మాన కార్యక్రమం జిల్లా గజిటెడ్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక బాపట్ల కలెక్టరేట్ లోని స్పందన సమావేశ మందిరంలో జరిగింది. పూర్వ కలెక్టర్, జేసీలకు శాలువలు కప్పి పుష్పమాలలతో ఘనంగా సన్మానించారు. అలాగే ప్రస్తుత కలెక్టర్, జేసీలను ఆహ్వానిస్తూ అధికారులు ఘనంగా సత్కరించారు. అధికారులు, ప్రభుత్వ యంత్రాంగం సమన్వయంతో పనిచేసినప్పుడే జిల్లాను అభివృద్ధిలోకి తీసుకొని వెళ్లగలమని కలెక్టర్ తెలిపారు. జిల్లా పురోగతి సాధించ లేకపోతే సహించేది లేదన్నారు. మీ విధి నిర్వహణలో ఎంతమంది పేదలకు సహాయం చేశాము అనే ఆత్మ విమర్శ చేసుకోవాలన్నారు. నూతన జిల్లాలో అన్ని వనరులు అందుబాటులోకి వచ్చేలా పూర్వ కలెక్టర్ విజయకృష్ణన్ చేసిన కృషిని అభినందించారు. నూతన జిల్లాగా ఏర్పడిన మచిలీపట్నంలో చేయడం ఒక అనుభవం అయితే, తదుపరి నూతన జిల్లాకే వచ్చి పనిచేసే మరో అవకాశం లభించడం సంతోషదాయకమన్నారు. పూర్వ కలెక్టర్, జేసీలు మంచి పేరు సంపాదించారన్నారు. బాపట్ల జిల్లా ప్రజలు అందించిన సహకారం, ప్రేమానురాగాలు ఎన్నడు మరువలేనివని బదిలీపై వెళ్లిన జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. బాపట్ల జిల్లా పురోభి వృద్ధికి యంత్రాంగం అహర్నిశలు కృషి చేసిందన్నారు. అందుబాటులో వనరులు లేకపోయినప్పటికీ నూతన జిల్లాకు సమకూర్చడంలోనూ, ప్రజలకు సేవలు అందించడంలో అధికారులు ఎంతో కష్టపడ్డారన్నారు. అభివృద్ధి పథంలోకి నడిపించడంలో జిల్లా అధికారుల కృషిని ఆమె గుర్తు చేశారు. యంత్రాంగమంతా సమన్వయ సహకారంతో అందించిన తోడ్పాటు, వారి అనుబంధం విస్మరించలేనని చెప్పారు. జిల్లాతో ఏర్పడిన అనుబంధాన్ని పంచుకున్నారు. పొరుగు జిల్లాలతో సమానంగా బాపట్లను నిలబెట్టడంలో తొలి కలెక్టర్గా విజయకృష్ణన్ చేసిన కృషి అభినందనీయమని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ అన్నారు. వనరులు సమకూర్చడంలో, పాలనకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారని వివరించారు. ఉన్నతమైన ఆలోచనలతో పని చేసి బాపట్ల చరిత్రలో నిలిచి పోయారని ఆయన చెప్పారు. గంజాయి వంటి నిషేధిత మాదక ద్రవ్యాలు అరికట్టేందుకు కలెక్టర్ అందించిన సహకారాన్ని మరు వలేనన్నారు. జిల్లా సంయుక్త కలెక్టర్గా డా. శ్రీనివా సులు నిరంతరం కృషి చేస్తున్నారని వివరించారు. ప్రభుత్వ సేవలను క్షేత్రస్థాయిలో ప్రజలందరికి తీసుకు వెళ్లడంలో పూర్వ కలెక్టర్, జెసిలు అహర్నిశలు పనిచేశారని జిల్లా సంయుక్త కలెక్టర్ సిహెచ్ శ్రీధర్ అన్నారు. నూతనంగా ఏర్పడిన బాపట్ల జిల్లా అభివృద్ధిలో తొలి కలెక్టర్గా విజయకృష్ణన్ చెరగని ముద్ర వేసుకు న్నారని జిల్లా రెవెన్యూ అధికారిని కె లక్ష్మి శివజ్యోతి తెలిపారు. ఎన్నో విజయాలు సాధించి ప్రజలకు ఉత్తమ సేవలు అందించారని ఆమె గుర్తు చేశారు. ఈ కార్యక్ర మంలో జిల్లా పూర్వ సంయుక్త కలెక్టర్ కె శ్రీనివాసులు, జిల్లా అదనపు ఎస్పీ మహేష్, బాపట్ల, రేపల్లె జి.రవీందర్, పార్థసారథి, గెజిటెడ్ అధికారుల సంఘం నాయకులు బి.అర్జున్ రావు, జి భరత్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మారెడ్డికి ఎమ్మెల్యే కోన రూ.10 లక్షల చెక్కు అందజేత

విశాలాంధ్ర - బాపట్ల : బాపట్ల మండల పరిధిలోని పాండురంగపురానికి చెందిన కుక్కల బ్రహ్మారెడ్డి గత రెండు సంవత్సరాల క్రితం కరోనా మహమ్మారి దాటికి కుడి కంట్లో బ్లాక్ ఫంగస్గా వ్యాపించింది. దీంతో ఎన్నో లక్షల ఖర్చుపెట్టిన హాస్పటల్లో డాక్టర్స్కి వైద్యం చేసినా లాభం లేకపోయింది. చివరకు బ్లాక్ ఫంగస్ సోకడం వలన కన్నును తొలగించడం జరిగిందన్నారు. కుటుంబంలో పెద్ద దిక్కు అతను అతనికి ఇలా జరగడంతో భార్య, ఇద్దరు పిల్లలు కుటుంబ సభ్యులతో సహా శోకసముద్రంలో మునిగిపోయారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ప్రవేశ పెట్టినటువంటి సీఎం రిలీఫ్ ఫండ్కి దరఖాస్తు చేసుకోగా కొన్ని కారణాల వలన పెండింగ్లో ఉండటం జరిగింది. అదే సమయంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా అడవి గ్రామపంచాయతీ పాండు రంగాపురంలో శాసనసభ్యులు కోన రఘుపతి పర్యటిస్తుండగా బాధిత కుటుంబీకులతో కలిసి నక్కా వీరారెడ్డి ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి వివరించగా ఎమ్మెల్యే కోన భరోసా ఇచ్చారు. ఈనేపథ్యంలో మంగళవారం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా కుక్కల బ్రహ్మారెడ్డి రూ. 10 లక్షలు చెక్కును అందజేశారు. బ్రహ్మా రెడ్డి కుటుంబ సభ్యులు కోన రఘుపతి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాండురంగాపురం వైఎస్ఆర్సిపి పార్టీ ఇంచార్జ్ నక్కా వీరారెడ్డి నాయకుల పాల్గొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన డ్రైవర్ను కాపాడిన పోలీసులు

- కౌన్సిలింగ్ ఇచ్చి కుటుంబీకులు అప్పగింత

విశాలాంధ్ర - బాపట్ల : కుటుంబ కలహాల నేపథ్యంలో ఆత్మహత్యకు యత్నించిన ఆర్టీసీ డ్రైవర్ను కాపాడి కుటుంబీకులకు అప్పగించిన సంఘటన జిల్లాలోని చీరాలలో జరిగింది. చీరాల టూ టౌన్ సీఐ సోమశేఖర్ తెలిపిన వివరాల మేరకు చీరాలలోని ఐక్య నగర్ రెండోవ కాలనీలో నివాసముంటున్న కాంట్రాక్ట్ ఆర్టీసీ డ్రైవర్ దుడ్డు శామ్యూల్ ఈ నెల 17వ తేదీ సోమవారం రాత్రి తన భార్య పిల్లలతో గొడవ పడినట్లు తెలిపారు. దీంతో మనస్థాపం చెంది ఏప్రిల్ 18 మంగళవారం ఉదయం ఇంటి నుండి వెళ్ళిపోయి రైలు కింద పడి చనిపోబోతున్నానని తన మిత్రుడికి ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. విషయాన్ని సీఐకు తెలపగా వెంటనే ఎస్.ఐ సురేష్,హెడ్ కానిస్టేబుల్ బాజీత్, శివ ప్రసాద్, కానిస్టేబుల్ అహ్మద్ బాషా, వెంకటేశ్వర్లులతో ప్రత్యేక బృందాలుగా ఏర్పరిచి సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి దుడ్డు శామ్యూల్ ఉన్న ప్రదేశాన్ని గుర్తించి వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని ఆత్మహత్య చేసుకోవడానికి రైలు పట్టాలపై ఉన్న దుడ్డు శామ్యూల్ను గుర్తించి కాపాడినట్లు తెలిపారు. అనంతరం దుడ్డు శామ్యూల్ మరోసారి ఆత్మహత్యకు యత్నించకుండా అతడికి కౌన్సిలింగ్ నిర్వహించి వారి కుటుంబ సభ్యులకు అప్పగించామన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్జిందాల్ పోలీస్ అధికారులను, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. జీవితంలో ఎదురయ్యే ఆటుపోట్లను ఎదుర్కోలేక చిన్నచిన్న సమస్యలను సైతం భూతద్దంలో చూస్తూ భయపడిపోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. ప్రతి ఒక్కరికి జీవితంలో ఏదో ఒక సమస్య వుంటుందని, సానుకూల ధోరణితో ఆలోచిస్తే ఆ సమస్యలకు తప్పకుండ పరిష్కార మార్గాలు ఉంటాయన్నారు. సానుకూల ధోరణిలో ఒక క్షణం ఆలోచించిన ఆత్మహత్యలు నివారించడం సులభమన్నారు. సమస్యలను బాధలను సన్నిహితంగా ఉండే బంధువులు, స్నేహితులతో పంచుకోవడం ద్వారా పరిష్కారం లభించే అవకాశం ఉంటుందన్నారు. ఆత్మహత్య భావన మదిలో కలిగినప్పుడు శ్వాసపై ధ్యాస ఉంచి ఓ పది నిమిషాలు ఉండడం లేదా బంధువులు, కుటుంబ, సభ్యులతో, స్నేహితులతో గడపడం వల్ల ఆ ఆలోచన నుండి బయట పడవచ్చునన్నారు. కుటుంబ సభ్యులు సైతం బలహీన మనస్తత్వం ఉన్న వారిని ఒంటరిగా వదలడం మంచిది కాదని ఎస్పీ సూచించారు.

నిఘా నేత్రంలో కర్లపాలెం

- నేరాల చోరీల నియంత్రణకు ఎస్సై శివయ్య ప్రత్యేక చర్యలు
- దాతల సహకారంతో సీసీ కెమేరాల ఏర్పాటు

విశాలాంధ్ర - కర్లపాలెం : కర్లపాలెం మండలంలో పూర్తిస్థాయిలో నేరాలు,చోరీలు అరికట్టడమే లక్ష్యంగా ఎస్సై శివయ్య ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. దీనిలో భాగంగా కర్లపాలెం ఐలాండ్ సెంటర్లో అధునాతన సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించారు. శాంతిభద్రత పరిరక్షణే లక్ష్యంగా ఎస్సై శివయ్య డేగ కన్నుతో పర్యవేక్షించనున్నారు. అదేవిధంగా మండలంలోని అన్ని పంచాయతీలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసే విధంగా అందర్నీ ప్రోత్సహిస్తున్నారు. నేరాలు అరికట్టడంతో పాటు, చోరీ ల నియంత్రణ, శాంతి భద్రతలకు కూడా ఈ సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయి. ఈ క్రమంలో భాగంగా కర్లపాలెం సెంటర్ లోని జాతీయ రహదారి పై నాలుగు ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. దీంతో రోడ్డు ప్రమాదాలు, రహదారిపై ట్రాఫిక్ గొడవలు, తోపుడుబండ్లతో వచ్చే ఇబ్బందులను ఎప్పటికప్పుడు అరికట్టే విధంగా ఆయన చర్యలు తీసుకుంటున్నారు. ఇంకా మరికొన్ని ప్రదేశాల్లో కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసే విధంగా ఆయన చర్యలు తీసుకుంటున్నారు. మండలంలో దాదాపుగా అన్ని పంచాయతీల సర్పంచులు గ్రామ పెద్దలు కార్యదర్శులతో మాట్లాడి ప్రతి గ్రామంలో ఒకటి లేక రెండు చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునే విధంగా వారిని ప్రోత్సహిస్తున్నారు. ఆయన ఎక్కడ పని చేసిన ఆ ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడానికి ఆ ప్రాంతం వారిని ప్రోత్సహిస్తూ ఉంటారు. ఈ క్రమంలోని కర్లపాలెం మండలంపై కూడా పూర్తిగా ఆయన డేగ కన్ను వేసి అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా నేరాలు నియంత్రించవచ్చు అని ఆయన ప్రయత్నం చేస్తున్నారు.ఇలాంటి మంచి కార్యానికి దాతలు కూడా ముందుకు వచ్చి మరికొన్ని సీసీ కెమెరాలు అందజేసినట్లయితే ఇంకా మరికొన్నిచోట్ల వాటిని ఏర్పాటు చేసుకోవడానికి అవకాశం ఉంటుంది.

బీఈసీలో ముగిసిన అంతర్జాతీయ కమ్యూనికేషన్స్ సదస్సు

విశాలాంధ్ర - బాపట్ల రూరల్ : బాపట్ల ఇంజనీరింగ్ కాలేజీలో రెండు రోజులుగా కమ్యూనికేషన్స్, సిగ్నల్ ప్రాసెసింగ్ కంప్యూటింగ్ అనే అంశాలపై జరుగుతన్న అంతర్జాతీయ స్థాయి సదస్సు మంగళవారంతో ముగిసింది. ఆఖరి రోజు ఆచార్య నాగార్జున యూనివర్సిటీఈసీఈ విభాగాధిపతి ఆచార్య డాక్టర్ ప్రతిభ మెడికల్ ఇమేజ్ ప్రాసెసింగ్ అనే అంశంపై తన ప్రయోగాత్మక పరిశోధనలను కార్యక్రమానికి హాజరైన విద్యార్థులకు, అధ్యాపకులకు పరిశోధకులకు వివరించారు. బీఈసీ కళాశాల ప్రెసిడెంట్ ముప్పలనేని శ్రీనివాసరావు సెక్రటరీ మానం నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇలాంటి సదస్సులు వలన పరిశోధక విద్యార్థులు మరియు అధ్యాపకులు మారుతున్న సాంకేతిక పరిజ్ఞానంలో నూతన వరవడి ఎలా అందిపుచ్చుకోవలెనో ప్రయోగాత్మకంగా తెలుసుకొనవచ్చునని తెలిపారు. వైస్ ప్రెసిడెంట్ దొప్పలపూడి. రామ్మోహన్ రావు, గెల్లి దిలీప్ మాట్లాడుతూ విద్యార్థులు అధ్యాపకులు సాంకేతిక పరిజ్ఞానం మీద పట్టు సాధించాలంటే ఇలాంటి సదస్సులు కార్యక్రమాలకు హాజరవటం తప్పనసరి అన్నారు. జాయింట్ సెక్రెటరీ కొమ్మినేని హరి పద్మ ప్రసాద్ ట్రెజరర్ తాళ్లూరి రామకృష్ణ మాట్లాడుతూ బాపట్ల ఇంజనీరింగ్ కాలేజ్ ఇప్పుడు ఎల్లప్పుడూసాంకేతిక నూతన వరవడిని అందిపుచ్చుకొనుట ప్రయోగాత్మక నిర్మాణాల కొరకు కృషి చేయడంలో ముందు వరుసలో ఉంటదని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నజీర్ మాట్లాడుతూ రెండు రోజుల సదస్సుకు వివిధ రాష్ట్రాల నుండి 107 మంది విద్యార్థులు చర్చించారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

విశాలాంధ్ర - బల్లికురవ : ప్రభుత్వం నిర్దేశించిన సమయం లోపల జగనన్న కాలనీలలో గృహ నిర్మాణాలు పూర్తి చెయ్యాలని ఎంపీడీవో సిహెచ్ కృష్ణ అన్నారు.మంగళవారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో జరిగిన పంచాయతీ కార్యదర్శులు,ఇంజనీరింగ్ అసిస్టెంట్లు,హౌసింగ్ సిబ్బంది తో గృహ నిర్మాణాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పేదవాడి సొంతింటి కల నెరవేర్చాలనే లక్ష్యంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న జగనన్న కాలనీలలో గృహ నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయించాలన్నారు. ఈనెల 30వ తేదీ లోగా ప్రభుత్వం నిర్దేశించిన 317 గృహ నిర్మాణాలు పూర్తిచేసి గృహప్రవేశలు చేయించాలన్నారు.అదేవిధంగా సొంత స్థలాలలో నిర్మాణాలు పూర్తిచేసిన వారు కూడా గృహప్రవేశాలు చేసేందుకు సిబ్బంది చొరవ చూపాలన్నారు.జగనన్న కాలనీలలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా సకల సౌకర్యాలు కల్పించే విధంగా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు.గ్రామాలలో పారిశుధ్య పనులపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు.రోడ్లపై ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా,రోడ్ల పక్కనే ఎరువు దిబ్బల పోయకుండా చూడాలన్నారు.వేసవి దృష్ట్యా గ్రామాలలో త్రాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలన్నారు.గ్రామాలలో చేతిపంపులు చెడిపోతే తక్షణమే మరమ్మతులు చేయించాలన్నారు.ఈ సమావేశంలో ఈఓపిఆర్డి సీతామాలక్ష్మి,హౌసింగ్ ఏఈ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో అబ్రార్ మృతి..

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : బాపట్ల తెలుగుదేశం పార్టీలో మైనార్టీ సెల్ నాయకుడుగా చురుకుగా పనిచేస్తున్న షేక్ అబ్రార్ గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. మంగళవారం పార్టీ కార్యాలయం నందు జరిగిన ఇమామ్, మౌజాలకు రంజాన్ తోఫా అందిస్తున్న కార్యక్రమంలో కూడా తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి వేగేసిన నరేంద్ర వర్మ రాజుతో కలిసి చురుకుగా పాల్గొన్న షేక్ అబ్రర్ గుండెపోటుతో మరణించడం పార్టీకి తీరని లోటని నరేంద్ర వర్మ రాజు పేర్కొన్నారు. కార్యక్రమానంతరం ఇంటికి వెళ్ళిన సమయంలో ఆకస్మికంగా గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు అబ్రార్ను హాస్పటల్కు తరలించారు. వైద్య సహాయం అందేలోపే అబ్రార్ మృతి చెందడం బాధాకరమని బాల్య స్నేహితులు మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ తెలిపారు. అబ్రార్ కుటుంబానికి సంప్రగాఢ సానుభూతిని తెలియపరుస్తూ తమ సహాయ సహకారాలు అందిస్తామని మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్, మాజీ కౌన్సిలర్ సునీల్ కుమార్ తెలియజేశారు. అబ్రార్కు పార్టీ కుటుంబ సభ్యులు స్నేహితులు నాయకులు నివాళులర్పించారు.

అనధికార లేఅవుట్లు క్రమబద్ధీకరణ చేసుకోవాలి

విశాలాంధ్ర - బాపట్ల రూరల్ : బాపట్ల పట్టణంలో అనధికారంగా వేసిన లేఔట్లను క్రమబద్ధీకరణ చేసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం జీఓ నెంబర్ 10 ద్వారా ఉత్తర్వులు జారీ చేసిందని పురపాలక సంఘ కమిషనర్ భానుప్రతాప్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాపట్ల పట్టణ పరిధిలోని ఐపిఎల్పి నెంబర్ 2020, చాకలిపాలెం రోడ్డు దగ్గర గల సర్వేనెంబర్ 72/1, ఏ.1.12న్నర సెంట్లు విస్తరణలో 22 ప్లాట్లను సంచాలకులు పట్టణ, గ్రామీణ ప్రణాళిక మంగళగిరి ఇన్ ప్రిన్సిపల్ లే-అవుట్ ఆమోదం తెలిపారు. పై సర్వే నెంబర్లను ఉన్న లే అవుట్ను క్రమబద్ధికరణలో తగుసూచనలు, సలహాలు, అభ్యంతరములు ఏమైనా ఉంటే 15 రోజులు లోపు బాపట్ల పురపాలక సంఘ కార్యాలయంలో పనివేళలో రాతపూర్వకంగా తెలియజేయాలని కోరారు.

హత్య కేసు చేధించిన పోలీసులు

విశాలాంధ్ర - వేటపాలెం : మండలంలోని అంబేద్కర్ నగర్లో గత శుక్రవారం రాత్రి జరిగిన హత్య కేసును పోలీసులు త్వరితగతిన చేధించారు. హత్యకు పాల్పడింది కుటుంబీకులే అని సీఐ మల్లిఖార్జునరావు తెలిపారు. వేటపాలెం పోలీస్ స్టేషన్లో మంగళవారం విలేకర్ల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. సీఐ మాట్లాడుతూ అంబేద్కర్ నగర్కు చెందిన సలగల అజయ్ బాబు హత్య చేశారని అతని సోదరుడు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టామన్నారు. ఘటన స్థలంలో పరిసరాలను పరిశీలించి డాగ్ స్క్వాడ్ను రంగంలోకి దింపి దర్యాప్తులో భాగంగా మృతుని భార్య శోభారాణి, ఆమె తల్లి నాగమ్మలను అదుపులోనికి తీసుకొని విచారించగా నేరం చేశామని విచారణలో ఒప్పుకున్నారని తెలిపారు. మృతుని భార్యకు అక్రమ సంబంధం ఉందన్న అనుమానంతో తరచూ గొడవ పడుతూ ఉండేవాడని అనుమానంతోనే మృతుడు మద్యం సేవించి భార్యాభర్తలు గొడవ పడుతూ ఉంటారని, హత్య జరిగిన రాత్రి కూడా భార్యాభర్తల మధ్య తీవ్ర వాగ్వివాదం జరిగిందన్నారు. ఆ సమయంలో ఇంట్లో ఉన్న ఇనుప రాడ్డు తీసుకుని భర్త అజయ్ బాబును బలంగా కొట్టడంతో అక్కడికక్కడే మరణించినట్లు తెలిపారు. నేరం అంగీకరించిన మృతుని భార్య శోభారాణిని, ఆమె తల్లి నాగమ్మను రిమాండ్కు తరలిస్తున్నట్లు రూరల్ సీఐ మల్లికార్జున్ రావు తెలిపారు. సమావేశంలో వేటపాలెం ఎస్సై జి.సురేష్ పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింట్లు అయిన తెలంగాణ, హైదరాబాదు సిటీ, కూకట్ పల్లి,కె.పి.హెచ్.పి. కాలనీ కాపురస్తుడు రెడ్రౌతు పిచ్చయ్య గారి కుమారుడు భాస్కరరావు వగైరాల సూచనల మేరకు యావన్మందికీ తెలియజేయునదేమనగా,

నా క్లయింట్లు ది: 18-08-2016న విక్రయ దస్తావేజు నెం: 4803/2016 రుగా యస్.ఆర్.ఒ. కొరిటెపాడు ద్వారా క్రయం పొందిన గుంటూరు డి.,కొరిటెపాడు సబ్.డి., జి.యం.సి ఏరియాలో చేరిన గోరంట్ల గ్రామ డి.నెం: 487 య.18-80 సెంట్లు మింజుమలె య. 4-58 సెంట్లులో య.2-50సెంట్లు భూమిలో విజయవాడ VGTM ఉడా విజయవాడ వారి యల్.పి.నెం:9/2006/జి.యస్.టి. ప్లాట్ల ప్లాను దాఖలా నెం.328 రు ప్లాటులో పడమర దరి చ.గ. 309లు ఖాళీ నివేశన స్థలమునకు చెందిన ఆస్తి యొక్క ఒరిజినల్ లింకు దస్తావేజు నెంబర్లు 7979/2007, 7028/2014&7077/2014 మరికొన్ని డాక్యుమెంట్లును తీసుకోని ది: 17-04-2023 న బాపట్లలోని తన స్నేహితులు, బంధువుల ఇంటికి వెళ్ళి అక్కడ పని ముగిసిన తర్వాత చూసుకోనగా పై తెలిపిన దస్తావేజులు కనిపించలేదు. ఆ చుట్టుపక్కల ఎంత వెతికిన దొరక లేదు. కావున సదరు దస్తావేజులు ఎవరికైన దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్ నందు అందజేసిన వారికి తగిన బహుమతి ఇవ్వబడును. అట్లు కాక సదరు దస్తావేజును ఉపయోగించి ఏవిధమైన అన్యాక్రాంతములు జరిపిన నా క్లయింటు తీసుకోను చట్టపరమైన సివిల్ క్రిమినల్ చర్యలకు బాధ్యులుకాగలరు.

తోట శ్రీనివాసరావు, అడ్వకేట్, గుంటూరు.

నేడు ప్రభుత్వ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

విశాలాంధ్ర - బాపట్ల : పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరుపున జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో బాపట్ల జిల్లా మైనారిటీల సంక్షేమ శాఖ సహకారంతో బుధవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టరేట్ కార్యాలయం పత్రిక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని పటేల్నగర్ 1వలైను అన్నం సతీష్ ప్రభాకర్ కాపు కళ్యాణమండపం వద్ద సాయంత్రం 6.30 గంటలకు ఇఫ్తార్ విందు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, ముస్లిం సోదరులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

న్యాయవాదులు విధుల బహిష్కరణ

విశాలాంధ్ర-పర్చూరు: స్థానిక కోర్టులో మంగళవారం న్యాయవాదులు విధులు బహిష్కరించారు. రౌండ్టేబుల్ సమావేశంలో పాల్గొన్న న్యాయవాదులకు సిఐడీ అధికారులు నోటీసులు జారీచేసినందుకు నిరసనగా విధులు బహిష్కరించామని న్యాయవాదుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కొల్లా నరేంద్రకుమార్, రావి శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు.

రంజాన్ తోఫా పంపిణీ

విశాలాంధ్ర - రేపల్లె : నిరుపేద ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ చేయడం అభినందనీయమని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. పట్టణంలోని 25వ వార్డులో రంజాన్ పండుగ సందర్భంగా కౌన్సిలర్ జమీర్ ఆధ్వర్యంలో నిరుపేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు మాట్లాడుతూ రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని దాతలు పేదలకు తమ వంతు సాయంగా 300 మందికి 10 రకాల నిత్యావసర సరుకులు పంపిణీ చేయటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. పవిత్ర రంజాన్ పండుగను పేదలు కూడా సంతోషంగా జరుపుకోవాలనే ఆశయంతో నిత్యావసర వస్తువులు పంపిణీ చేయడం జరిగిందన్నారు.

టీడీపీ కౌన్సిలర్పై దుండగుల దాడి

- చికిత్స పొందుతూ మృతి

విశాలాంధ్ర - రేపల్లె: తెలుగుదేశం పార్టీ నాయకులు పట్టణంలోని 14వ వార్డు కౌన్సిలర్ అన్నే రామకృష్ణ (50) పై దుండగులు దాడి చేశారు. సోమవారం రాత్రి ఇసుకపల్లిలో తన గోశాలలో పనులు ముగించుకుని బైక్ పైన వస్తుండగా మార్గమధ్యంలోని దుర్గ రైస్ మిల్లు సమీపంలో దుండగులు దాడి చేశారు. సమాచారం అందుకున్న రామకృష్ణ మిత్రులు తీవ్రంగా గాయపడిన అతనిని రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ తెల్లవారు జామున మృతి చెందాడు. రామకృష్ణ విశ్రాంత సైనికుడు, తెలుగుదేశం పార్టీ సానుభూతి పరుడుగా ఉంటూ, రేపల్లె పురపాలక సంఘం 14 వార్డు నుండి టిడిపి తరుపున పోటీ చేసి గెలుపొందారు. రామకృష్ణకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అన్నే రామకృష్ణ మృతి పట్ల శాసన సభ్యులు అనగాని సత్యప్రసాద్ విచారం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి సంతాపం తెలిపారు.

సీఎం జగన్ను కలిసి కలెక్టర్ రంజిత్ బాషా

విశాలాంధ్ర - బాపట్ల : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డిని జిల్లా కలెక్టర్ పి.రంజిత్బాషా మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎం క్యాంప్ కార్యాలయంలో మంగళవారం సీఎం జగన్కు కలెక్టర్ పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లాలో బాధ్యతలు చేపట్టిన తొలిసారిగా కలెక్టర్ బాషా సీఎంను కలిసి జిల్లాకు సంబంధించిన విషయాలపై చర్చించారు.

గుండెపోటుతో హెడ్ కానిస్టేబుల్ తన్నీరు వెంకటేశ్వర్లు మృతి

విశాలాంధ్ర-అద్దంకి ; అద్దంకి పోలీస్స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ తన్నీరు వెంకటేశ్వర్లు సోమవారం వేకువజామున గుండెపోటుతో మృతి చెందారు.విషయం తెలుసుకున్న బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ వెంకటేశ్వర్లు స్వగ్రామం బల్లికురవ మండలం కొత్తూరు గ్రామానికి చేరుకొని వెంకటేశ్వర్లు పార్థీవదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.తీవ్ర సోకసంద్రంలో వున్న తన్నీరు వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడు తన్నీరు వెంకటేశ్వర్లు కుటుంబానికి పోలీస్శాఖ అండగా ఉంటుందని,శాఖా పరంగా కుటుంబానికి రావాల్సిన అన్ని రకాల పరిహారాలు,రాయితీలు సకాలంలో అందించడానికి కృషి చేస్తామని ఎస్పీ తెలిపారు.అనంతరం పోలీస్ శాఖ అధికార లాంఛనాలతో తన్నీరు వెంకటేశ్వర్లు పార్థీవదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.

టీడీపీ నాయకురాలు చిన్నమ్మ మృతి

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : హనుమంతునిపాడు గ్రామంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి మురహరి నరసయ్య మాతృమూర్తి మురహరి చిన్నమ్మ మంగళవారం తెల్లవారుజామున అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందడం జరిగింది. కుటుంబ సభ్యులను తెలుగుదేశం నేత సానికొమ్ము తిరుపతిరెడ్డి పరామర్శించారు.